

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల జాబితా విడుదల

నెల్లూరు (విద్య) : ఏపీలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాలను గురువారం అధికారులు విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. నూజివీడు, ఇడుపులపాయలలో ఈ నెల 22, 23వ తేదీల్లో, ఒంగోలులో 24, 25వ తేదీల్లో, శ్రీకాకుళంలో 26, 27వ తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. జిల్లా నుంచి నూజివీడుకు 61 మంది, ఇడుపులపాయకు 89 మంది, ఒంగోలుకు 41 మంది, శ్రీకాకుళంకు 27 మంది కలిపి మొత్తం 218 మంది ఎంపికయ్యారు.

గంజాయ్ విత్ ఎంజాయ్!

- 20, 50 గ్రాముల పొట్లాలలో అమ్మకాలు
- సేల్స్‌మెన్ ద్వారా విస్తృతంగా విక్రయాలు
- బార్లు, మద్యం దుకాణాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలే టార్గెట్
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు
- నియంత్రణలో చేతులెత్తేస్తున్న నిఘా వ్యవస్థ



నెల్లూరు (క్రైం), జూలై 11 : యువత, విద్యార్థుల జీవితాల్లో గంజాయి విషపు వృక్షంలా మారుతోంది. స్మగ్లర్లు కూడా వారినే టార్గెట్ చేసుకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న హత్యలు, ఘర్షణలు, హత్యాయత్నాలు ఇలా ఎన్నో ఘటనలు గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ ర్యాకెట్ వెలుగులోకి తెచ్చి, వారే విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు తేల్చారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్ విద్యార్థులే ఎక్కువగా మత్తుకు బానిసలు అవుతున్నారు. తమ విద్యాసంస్థకు చెడ్డపేరు వస్తుందనే నెపంతో కళాశాల యాజమాన్యాలు కూడా గుట్టుచప్పుడుగా వ్యవహరిస్తున్నాయి. కేవలం తల్లిదండ్రులకు విషయం తెలియజేసి, మిన్నకుండిపోతున్నారు.

● బానిసలుగా మారుతూ..

ఇంటర్ చదువుతున్న సమయంలో స్నేహితులు, క్లాస్‌మెట్స్, క్రీడల్లో పరిచయమయ్యే వ్యక్తుల ద్వారా విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నారు.



విద్యార్థుల కోసమే అన్నట్టుగా విక్రయదారులు 50, 100 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి రూ.200 నుంచి 300 వరకు ఒక్కో ప్యాకెట్‌ను విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడిని కలుపుకొని పీలుస్తూ దానికి బానిసగా మారుతున్నారు. ఇక అక్కడ నుంచి మత్తు పదార్థాలైన ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, బ్రౌన్‌షుగర్, హెరాయిన్ వంటి వాటి రుచి చూసేందుకు ఇతర రాష్ట్రాల వైపు అడుగులు వేస్తున్నారు.

● నిఘా ఏమైనట్టు!?

చాపకిందనీరులా గంజాయి వ్యాపారం గుప్పుమంటున్నా పోలీసుల్లో మాత్రం చలనం కరువయ్యింది. గంజాయిపై ఉక్కుపాదం మోపాల్సిన సెబ్ లంచాల మత్తులో కూరుకుపోయారని ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆర్పీసీ విజిలెన్స్, రైల్వే పోలీసులు మామూళ్ల మత్తులో ఉన్నారన్న విమర్శలూ లేకపోలేదు. జిల్లా వ్యాప్తంగా గంజాయి మత్తును నియంత్రించడంలో సివిల్ పోలీసులు మాత్రం అప్పుడప్పుడు జూలు విదిలిస్తున్నా ఆశించిన ఫలితాలు ఉండటం లేదు.

మైదానంలో సిగరెట్లు తాగుతున్న కొంతమంది యువకుల వద్దకు ఓ అజ్ఞాత వ్యక్తి చేరి, వారితో మాటలు కలిపాడు.

అజ్ఞాత వ్యక్తి : ఆ సిగరెట్టు పేరేమి!?

యువత : ఇది..... ఉన్న వాటిలో ఇదే కాస్ట్లీ.

అజ్ఞాత వ్యక్తి : అవునా!? కిక్కు వస్తుందా!

యువత : పర్వాలేదు. తాగుతున్నాం.

అజ్ఞాత వ్యక్తి : మీకు మంచి కిక్కు కావాలంటే. ఇదిగో ఈ పొట్లంలో ఉండే పదార్థాన్ని సిగరెట్‌లో కలుపుకొని తాగండి. ఆ మజానే వేరుగా ఉంటుంది.

యువత : ఏంటన్నా ఇది. ఆరోగ్యం పాడవదుగా.

అజ్ఞాత వ్యక్తి : అయ్యో తమ్ముళ్లు. నేను ఇక్కడే ఉంటాను కదా. ఓసారి ట్రై చేయండి. వచ్చే కిక్కును చూసి మీరే అడుగుతారు.

ఇంకేముంది. ఇలా రెండుసార్లు ఉచితంగా ఇచ్చిన ఆ అజ్ఞాత వ్యక్తి మూడోసారి రూ.100, ఆ తర్వాత 200-300 చొప్పున విక్రయించాడు. మత్తుకు అలవాటుపడ్డ యువకులు కూడా ఆ డబ్బు ఇచ్చేందుకూ వెనుకాడలేదు.



మూణ్నెల్ల క్రితం వరకూ బాగా చదువుతున్న కుమారుడిలో మార్పును తల్లిదండ్రులు గమనించారు. ప్రతి చిన్న విషయానికి చిరాకు పడటం, ఏ చిన్నపని చేసినా అలసిపోవడం, ఇంట్లో వస్తువులను నేలకేసి కొట్టడం, నిద్రలేకుండా తిరగడం వంటివి గమనించి కుమిలిపోయారు. వెంటనే వైద్యుణ్ని సంప్రదించగా, 'మత్తు'కు అలవాటు పడినట్టు తేలింది.

● సేల్స్‌మెన్‌తో విస్తరణ

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖ, నర్సీపట్నం, ఏఓబీ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని సేకరిస్తున్నారు. ఆ తర్వాత పోలీసుల కంట పడకుండా రైళ్లు, బస్సులు మారుతూ ఎంతో చాకచక్యంగా గంజాయిని జిల్లాకు తరలిస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు కిలో రూ.5 వేలకు గంజాయిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఆ తర్వాత కిందిస్థాయి వ్యాపారులకు కిలో రూ.8 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో వీరు 20, 50 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి విక్రయించే వారు. అయితే వారి వ్యాపారశైలి పూర్తిగా మారిపోయింది. ఇలా అమ్మకాల ద్వారా కిలోకు రూ.15 వేలకుపైగా అధిక ఆదాయం పొందుతున్నారు. యువత, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. కొందరు సేల్స్‌మెన్‌ను నియమించుకుని కమీషన్‌తోపాటు నెలవారి జీతాలు ఇస్తున్నారు. వీరు చేయవలసిందల్లా కళాశాలలు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా థియేటర్లు, కేఫ్‌లు, బార్లు, మద్యం దుకాణాలు, క్రీడామైదానాలను టార్గెట్ చేసుకుంటారు. ఆ ప్రాంతాల్లో సిగిరెట్లు, మద్యం సేవించే వారిని గుర్తిస్తారు. వారి వద్దకు వెళ్లి 'ఇదేం మత్తు గంజాయి ఓసారి పీల్చండి ఈ మత్తు చూడండి.' అంటూ ఉచితంగా ఇచ్చి అలవాటు చేస్తారు. మెల్లమెల్లగా మత్తుకు బానిసలు చేసి గంజాయిని అధిక ధరకు విక్రయిస్తారు.

● గంజాయి మత్తులో చిక్కుకుంటున్న యువత ● విశాఖ ప్రాంతం నుంచి జిల్లాకు దిగుమతి ● కిలో రూ.5వేలకు కొనుగోలు.. రూ.15వేలకుపైగా ఆర్జన



చిన్న చిన్న ప్యాకెట్లలో ఉన్న గంజాయి. వీటినే నెల్లూరులో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● ఈ లక్షణాలు ఉంటే..

గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థుల లక్షణాలను వైద్యులు తెలిపారు.

- మత్తుకు అలవాటు పడిన తర్వాత గతంలోలా వ్యవహార శైలి ఉండదు.
- ఇళ్లకు వచ్చిన వెంటనే కళ్లు ఎర్రగా అలిసిపోయినట్లు ఉండటం, ఎక్కువగా చిరాకు పడటం.
- కోపం ఎక్కువ రావడం, తమపై వారు నియంత్రణ కోల్పోవడం, చేతికి ఏది దొరికితే వాటితో వస్తువులు పగల గొట్టడం.
- సరిగా నిద్రపోకపోవడం, ఎప్పుడు పడితే అప్పుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోవడం వంటి లక్షణాలు ఉంటే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.



ఎంతో మందికి కౌన్సిలింగ్ ఇచ్చా



గంజాయికి బానిసలైన ఎంతోమంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చా. మత్తుకు బానిసైన వారు వారిపై వారికి నియంత్రణ ఉండదు. మత్తుకు బానిస అయినవారిని ఒక్కసారిగా నియంత్రించేందుకు ప్రయత్నించకూడదు. గంజాయి, మద్యంకు ఎలా అలవాటు పడ్డారో కౌన్సెలింగ్ ఇవ్వాలి.

\- డాక్టర్ సురేష్‌బాబు, మానసిక వైద్యనిపుణులు





హోమగుండంలో కొబ్బరి వేస్తున్న భక్తులు, వెంగమాంబ దంపతులు (ఇన్‌సెట్‌లో)

నర్రవాడలో భక్తజనం

- వైభవంగా వెంగమాంబ 16 రోజుల ఉత్సవం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 11 : నర్రవాడలో వెలసి ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పదహారు రోజుల ఉత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహార రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని ఉత్సవానికి తరలివచ్చారు. అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించి, హోమగుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త వెంకటసురేష్‌బాబు, మాజీ చైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆలయ ఈవో ఉషశ్రీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయగిరి, కలిగిరి సీఐలు వేల్పుల గిరిబాబు, ఫిరోజ్, ఎస్‌ఐలు ఉమాశంకర్, ఇంద్రసేనారెడ్డిలు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



నెల్లూరులోని రైతుబజారులో రాయితీ సరుకుల కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్వో రమణ

రాయితీ ధరకు కందిపప్పు, బియ్యం

రైతుబజార్లలో విక్రయాలు

నెల్లూరు (హరనాథపురం) : రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వినియోగదారులకు కొంతమేర ఉపశమనాన్ని కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. జిల్లాలోని రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లతో అధికారులు చర్చలు జరిపారు. రైతు బజార్లలో రాయితీ ధరపై కంది పప్పు, బియ్యం అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.160కి (బహిరంగ మార్కెట్‌లో రూ.181), నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) రూ.49, రా బియ్యం రూ.48లకు వంతున విక్రయించనున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో స్టీమ్ బియ్యం రూ.55.85, రా బియ్యం రూ.52.40 ఉంది. ఈ మేరకు నగరంలోని నవాబుపేట, పప్పులవీధి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్‌లను జిల్లా పౌరసరఫరాల అధికారి రమణ, కందుకూరులో సబ్ కలెక్టర్ విద్యాధరి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో రమణ మాట్లాడుతూ శుక్రవారం నెల్లూరులోని పత్తేఖాన్‌పేట, పొదలకూరు రైతుబజార్లలో కౌంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్డీవో మలోల, జిల్లా రైసు మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగయ్య నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్యసేవల్లో జీజీహెచ్‌కు 3వ స్థానం

నెల్లూరు (వైద్యం), జూలై 11 : ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలలో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) వైద్యులు ప్రతిభ చూపుతున్నారు. ఇచ్చిన లక్ష్యానికి మించి వైద్యసేవలు అందిస్తున్నారు. గత నెలలో 940 ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, జీజీహెచ్ వైద్యులు లక్ష్యానికి మించి 1,149 వైద్యసేవలు (127 శాతం) అందించారు. జనరల్ మెడిసిన్ కింద 511, జనరల్ సర్జరీ 154, గర్భకోశ విభాగంలో 135, ఆర్థోపెడిక్ విభాగంలో 72, మిగిలిన విభాగాల్లో 277 వైద్య చికిత్సలు జరిగాయి. ఒక నెలలోనే అత్యధిక వైద్యచికిత్సలు అందించినందుకు రాష్ట్రంలోనే జీజీహెచ్ మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాలను విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రులకే దక్కాయి. మొత్తంగా నెల్లూరు జీజీహెచ్‌లో ఈ ఏడాది జూన్ వరకు అంటే 6 నెలల్లోనే 5,624 చికిత్సలు అందించారు. అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న జీజీహెచ్ వైద్యులకు ఆరోగ్యశ్రీ చికిత్సలపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రసంశలు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ వైద్యసేవలపై జీజీహెచ్ అధికారులకు ప్రోత్సాహక ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు సంబంధించి ప్రభుత్వం అందించే నగదులో 30 శాతం వైద్యులకు, సిబ్బందికి వస్తుంది. ఇందులో వైద్యులకు ప్రత్యేకంగా 17 శాతం అందిస్తారు. ఇక మోర్క్ అనే ప్రభుత్వ సంస్థకు 45 శాతం ఇస్తుండగా, ఆసుపత్రి అభివృద్ధికి 25 శాతం ఆరోగ్యశ్రీ నిధులు చేకూరనున్నాయి. గతంలో ఆరోగ్యశ్రీ చికిత్సలలో రాష్ట్రంలో ఉన్న 23 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే 10 స్థానంలో నెల్లూరు జీజీహెచ్ నిలిచేదని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. లక్ష్యాలను అధికమించి 3వ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఆరోగ్యశ్రీ చికిత్సలు ఇలా..

సంవత్సరం	వైద్యసేవలు
2021	5585
2022	4646
2023	10,247
2024 (జూన్ వరకు)	5624

నీలకంఠేశ్వరుడి భూముల్లో దొంగలు పడ్డారు!

అధికారులు, అక్రమార్కులు కలిసి నీలకంఠుడికే శఠగోపం పెట్టారు. ఆలయ భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు జరిపి విలువైన ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. గడిచిన నాలుగేళ్లలో రూ.25కోట్ల విలువైన గ్రావెల్, గులకరాళ్లను అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం అప్పటి కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఫిర్యాదు చేసినా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోలేదు. పైగా తూతూమంత్రపు తనిఖీలతో అందరినీ మభ్యపెట్టారు.

- కొండబీడు భూముల్లో అక్రమ మైనింగ్
- 2021 నుంచి విచ్చలవిడిగా తవ్వకాలు
- లీజు అగ్రిమెంట్ లేకుండా గ్రావెల్ స్టోన్ దోపిడీ
- దేవదాయ శాఖకు ఫిర్యాదు చేసిన అప్పటి ఎమ్మెల్యే
- ఇప్పటిదాకా రూ.25 కోట్ల ప్రకృతి సంపద ఆవిరైనట్టు అంచనా?
- అధికారుల ఉదాసీనతపై విమర్శల వెల్లువ





గ్రావెల్ నుంచి స్టోన్స్ వేరు చేస్తున్న యంత్రం

ఉలవపాడు, జూలై 11 : ఉలవపాడులోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం కొండబీడు భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. నాలుగేళ్లుగా ఈ తంతు జరుగుతున్నా దేవస్థానం అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం పలు సందేహాలకు తావిస్తోంది. ఉలవపాడు, కరేడు, మన్నేటికోట, ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామాలలో నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన సుమారు 85 ఎకరాల భూమి దేవదాయ శాఖ ఆధీనంలో ఉంది. శానంపూడిలోని సర్వే నెం.519లో 30.05 ఎకరాల కొండ బీడు, మరో 40 ఎకరాల సాగు భూమి ఉంది. కొండ బీడు భూముల్లో గులకరాళ్లు, ఎర్రమట్టి మిళితమై ఉంటుంది. సాగుకు అనుకూలత లేకపోవడంతో ఈ భూములవైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. కాగా, ఆలయ భూములు ఆనుకొని ఉన్న సర్వే నెం.519/2లో 1.121 హెక్టార్ల భూమిని పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి గ్రావెల్ స్టోన్ క్వారీ నడుపుకునేందుకు సింగరాయకొండకు చెందిన రెవెన్యూ అధికారులు 2021లో లీజుకు ఇచ్చారు. అయితే, పక్కనే ఉన్న దేవుడి మాన్యంపై కన్నేసిన సదరు వ్యక్తి దేవదాయ శాఖ అధికారుల అండతో గ్రావెల్ తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ భూముల్లో లభించే గ్రావెల్‌ను జల్లెడ యంత్రాల ద్వారా రాళ్లను గ్రేడింగ్ చేసి విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో బోర్లు కేసింగ్ పూడికకు, చేపలు, రొయ్యలు చెరువుల కట్టల లీకేజీని అరికట్టేందుకు, రహదారుల నిర్మాణానికి ఈ తరహా రాళ్లకు మంచి గిరాకీ ఉంది.

● గ్రామస్థుల్లో మొదలైన అలజడి

తమ గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపోరంబోకు భూమిలో అంత ఆదాయం వచ్చే సంపద ఉందా అని గ్రామస్థులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. క్వారీలో జరుగుతున్న హంగామా, అక్రమ సంపాదన చూసిన గ్రామస్థులు రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై భారీగా దుమారం రేగడంతో ఉలవపాడు దేవదాయ శాఖ అధికారులు ఆ భూములు ప్రైవేటు వ్యక్తులకు చెందినవంటూ బుకాయిస్తూ వచ్చారు. చివరికి అప్పటి కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చొరవతో ప్రకాశం జిల్లా మైనింగ్ అధికారులు 2022లో దాడులు చేసి ఓ ఎక్స్‌కవేటర్, తవ్విన గ్రావెల్ స్టోన్‌పై సుమారు రూ.2 లక్షలు పెనాల్టీ కట్టించారు. నీలకంఠేశ్వర స్వామి దేవుడి మాన్యంలోని సుమారు 10 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేసి ఎకరాకి సుమారు రూ.కోటి విలువైన సంపదను దోచుకున్నాడని, అక్రమార్కులకు రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు సహకరించినట్లు తన ఫిర్యాదులో అప్పటి ఎమ్మెల్యే పేర్కొనడం గమనార్హం. అయితే రోజులు గడుస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం ఉండటంలేదు. అక్రమ సంపద ఆవిరవుతున్నట్టు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా దేవదాయ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఆరోపించిట్లు సుమారు రూ.25 కోట్ల దోపిడీ జరిగిందని అందులో అధికారులు, మధ్యవర్తులకు తప్ప ఆలయ అభివృద్ధికి ఒక్క పైసా కూడా దక్కలేదు. గత నెలలో దేవదాయ శాఖ అధికారులు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించినా అక్రమార్కుల పై చర్యలు తీసుకున్న పాపానపోలేదు. నీలకంఠేశ్వరుడి ఆలయ ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించి, రూ.40వేలు పెనాల్టీ వేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, క్రిమినల్ కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించగా మాట దాటవేశారు.

పీకేపాడు రీచ్‌లో ఇసుక దోపిడీ

● అనుమతుల్లేకుండానే రవాణా ● పట్టించుకోని అధికారులు



పీకేపాడు రీచ్‌లో లారీకి ఇసుక నింపుతున్న ఎక్స్‌కవేటర్

అనంతసాగరం, జూలై 11: ఇసుకకు భారీగా డిమాండ్ ఉండడంతో పడమటి కంభంపాడు రీచ్ లో ఇసుక దోపిడీకి తెరలేపారు. ఇటీవల ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అందుబాటులోకి తెచ్చిం ది. ఇప్పటివరకు జిల్లాలో మూడు డంపింగ్ యార్డులకు మాత్రమే ఉన్న తాధికారులు పర్మిషన్ ఇచ్చా రు. నేరుగా రీచ్‌ల నుంచి ఇసుక ర వాణాకు అనుమతులు రాలేదు. ఈ క్రమంలో కొందరు ఇసుక రవాణా తో అక్రమార్జనకు ఉపక్రమించారు. పీకేపాడు రీచ్‌లో రెండురోజులుగా ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుకను నింపి తరలిస్తున్నారు. రీచ్‌లో ఇసుక తోడుకొ నేందుకు అనుమతులు ఇచ్చారా? అనే అనే విషయం చర్చినీయాంశంగా ఉంది. రెండురోజులుగా ఇసుక దోపిడీ జరుగుతుంటే అధికారులు చూస్తూ మౌనం వహించడం గమనార్హం. ఇదిలా ఉంటే పరిమితికి మించి లారీలు, టిప్పర్లతో ఇతరప్రాంతాలకు ఇసుక తరలుతోంది. ఈ తంతు వెనకాల ఎవరూ ఉన్నారు? అనే ప్రశ్న వినిపిస్తుంది. అధికారులు ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోవూరు, జూలై 11: స్థా నిక రాళ్ళమిట్ట కాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసును పోలీసులు తక్కువ వ్య వధిలో ఛేదించి నిందితుల్ని గు రువారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు స్థానిక స ర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోవూరు పోలీసులు హత్యకేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని రెండు రోజుల్లోనే నిం దితుల్ని అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీకి చెందిన పరతాపు చిన్న గోపయ్య అలియాస్ నాగరాజు, రమేష్, శ్రీను అలియాస్ అరవేడు కోవూరు జంగం వీధిలో తిరుగుతున్న పందుల్ని స్కూటీలో వచ్చి అపహరించేందుకు మంగళవారం ఉదయం ప్రయత్నించారు. దీంతో విషయం తెలుసుకున్న పందుల యజమాని మన్నేపల్లి రామకృష్ణ వారిలో పరతాపు చిన్న గోపయ్య నాగరాజు, రమేష్‌లను బంధించి స్కూటీని, సెల్‌ఫోను స్వాధీనం చేసుకుని కులపెద్ద పెంచలయ్య వద్దకు తీసుకువెళ్ళాడు. కులపెద్ద వారికి సర్దిచెప్పి పంపారు. దీంతో మనస్థాపం చెందిన పరతాపు చిన్న గోపయ్య అలియాస్ నాగరాజు కక్షతీర్చుకోవాలనే ఉద్దేశంతో మరో ముగ్గురు స్నేహితులు పెదాల దుర్గయ్య, కోటేశ్వరరావు, చి న్న కోటీశులతో కలిసి అదేరోజు మధ్యాహ్నం రామకృష్ణపై దాడి చేసేందుకు కత్తులతో దొమ్మ రిపాళెం వచ్చి స్కూటీ, సెల్‌ఫోను ఇవ్వమని రామకృష్ణను అడగడంతో పెద్దల సమక్షంలో ఇస్తా నని చెప్పాడు. దీంతో రెచ్చిపోయిన దుర్గయ్య కత్తితో రామకృష్ణ తొడపై పొడవడంతో తిరిగి రామకృష్ణ దుర్గయ్యను వీపు వెనుక భాగంలో పొడిచాడు. దీంతో పరతాపు నాగరాజు తన మి త్రుల్ని రామకృష్ణపై దాడిచేయవద్దని అడ్డుపడ్డాడు. దీంతో సహించలేక తమ మిత్రుడని కూడా చూడకుండా నాగరాజును పెదాల దుర్గయ్య, చిన్న కోటీశు కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు దుర్గయ్య, చిన్న కోటీశుల్ని పోలీసులు చాకచక్యంగా అరెస్టు చే శారు. హత్య కేసును రెండురోజుల్లోనే ఛేదించి అరెస్టు చేసిన సీఐ టీవై శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథగౌడ్‌లను ఇన్‌చార్జి ఎస్పీ సుమిత్ సునీల్, అడిషనల్ ఎస్పీ సౌజన్య అభినందించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి దుర్మరణం

బిట్రగుంట, జూలై 11: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం పేరం కోటయ్య (65)గ్రామ సమీపంలోని బిజ్జం కోటారెడ్డి, మునగాల భాస్కర్‌రెడ్డి పొల్లాలో గురువారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు స్థానికంగా పువ్వులు, కరివేపాకు కోసుకుని అమ్ము కుంటూ జీవిస్తుండేవాడని, రోజులాగే వెంకారెడ్డి మామిడి తోటకు ఉదయం వెలుతురు సరిగాలేని సమయంలో వెళ్లి ఈ దుర్ఘటన చెందాడు. అయితే కోట య్య మృతిపై అనుమానం ఉందని ఆయన కుమార్తె పాలకీర్తి మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్‌కానిస్టేబుల్ విజయప్రసాద్ మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.



మృతి చెందిన పేరం కోటయ్య

బుచ్చిరెడ్డిపాళెంలో చోరీ

● రూ.2.4 లక్షల నగదు, బంగారం అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 11: స్థానిక కాశీపాళెంలోని పీర్లచావిడి ప్రాంతంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని 2లక్షల 40వేల రూపాయల నగదు, 3 గ్రాముల బంగారు వుంగరం దోచుకున్నారు. ఇంటి యజమాని అందె గురుబ్రహ్మయ్య ఆయన భార్యతోపాటు హైదరాబాదులో హాస్టల్స్‌లో భోజనాలు తయారుచేసే పనులు నిర్వహిస్తుంటారు. గత నెల 22న వంట పనుల నిమిత్తం వారు హైదరాబా దుకు వెళ్ళారు. ఈనేపథ్యంలో బుధవారం వారి ఇంటి తాళాలు పగలగొట్టి వుండడం గుర్తించిన బంధువులు హైదరాబాదులోని యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో హైదరాబాదు నుంచి వచ్చిన బాధితులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

విడవలూరు, జూలై 11: మండల పరిధిలోని ముదివర్తి ఇసుక రీచ్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లని గురువారం రాత్రి స్థానిక పోలీసులు పట్టుకున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ముదివర్తి ఇసుక రీచ్‌లో ఎటువంటి తవ్వకాలు జరపకూడదని ఆదేశాలు జారీ చేశారు. అయినా కొందరు అక్రమార్కులు ముదివర్తి ఇసుక రీచ్‌లో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో రీచ్ నుంచి ఇసుకని తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లని స్థానిక ఎస్ఐ రాజ ము దివర్తి సినియా హాల్ సెంటర్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్లని పోలీసు స్టేషన్‌కి తర లించి దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6750
వెండి కిలో ధర	రూ. 95,100
వెండి ఒక గ్రాము	రూ. 97.10

కొత్త ఇసుక పాలసీతో

స్థానిక సంస్థల బలోపేతం



● సీనరేజీతో ఆర్థిక పరిపుష్టి ● పంచాయతీలకు సమకూరనున్న నిధులు

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఇసుక పాలసీతో జిల్లాలో స్థానిక సంస్థలు బలోపేతం కానున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్‌లను ఆర్థిక పరిపుష్టి ఏర్పడనుంది. ఐదేళ్లు మరుగునపడిన సీనరేజీ చార్జీల ద్వారా టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలకు పునరుజ్జీవింప చేయనుంది. కొత్తగా రూపొందించిన ఇసుక పాలసీని పూర్తిగా స్థానిక సంస్థలకు ఆర్థికంగా దోహదం చేస్తుంది.

సంగం, జూలై 11 : ఇసుక, గ్రానైట్, కంకర క్రసింగ్ వంటి వాటికి తప్పనిసరిగా సీనరేజీ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా వసూలు చేస్తుంది. ఇలా వసూలయ్యే మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం చివరగా జిల్లా పరిషత్తులకు బదిలీ చేయడం పరిపాటి. ఇందులో గ్రామ పంచాయతీల వాటా 50 శాతం, మండల పరిషత్తుల వాటాగా 25 శాతం, మరో 25 శాతం జిల్లా పరిషత్తులకు చెందుతాయి. మైనింగ్ కార్యక్రమాలు జరిగే పంచాయతీలకు మాత్రమే సీనరేజీ వాటా దక్కుతుంది. అదేవిధంగా ఏయే జిల్లాల్లో మైనింగ్ జరుగుతుందో ఆయా మండలాలకు, జడ్పీలకు మాత్రమే ఈ నిధులు వర్తిస్తాయి. ఇవేగాక ఇసుక, కంకర, మట్టి ఉపయోగించి చేసే రహదార్లు, సీసీ రోడ్లు, చెరువుల మరమ్మతులు, ప్రాజెక్టుల నిర్మాణాలు ఇలాంటి అన్ని రకాల పనుల్లో నుంచి కూడా సీనరేజీ చార్జీలు ప్రభుత్వమే కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తుంది. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో ఏ పంచాయతీలోనూ ఇసుక, కంకర, ఉపయోగించి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. గడప గడప వైసీపీ కార్యక్రమంలో మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినా సీనరేజీలు వసూలు చేసిన దాఖలాలు లేవు. ఒకవేళ వసూలు చేసినా వాటిని స్థానిక సంస్థలకు విడుదల చేసిన దాఖలాలు లేవు. దీంతో స్థానిక సంస్థలు కూడా సీనరేజీ చార్జీల విషయమే మర్చిపోయాయి. కాకపోతే ఈ ఐదేళ్లలో ప్రధానంగా ప్రభుత్వమే పెద్ద ఎత్తున ఇసుక వ్యాపారం నిర్వహించిన విషయం తెలిసిందే. అయినా సీనరేజీ చార్జీలను స్థానిక సంస్థలకు చెల్లించే ఆనవాయితీని మాత్రం పాటించలేదు. ఇసుక కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన ఈ సీనరేజీ చార్జీలు అసలు ఎక్కడ జమయ్యాయో కూడా తెలియని పరిస్థితి.

● **సీనరేజీ పేరుతో వసూలయ్యేదెంత?**

ఇసుక, గ్రానైట్ మైనింగ్, గ్రావెల్, కంకర క్రషింగ్ వంటి వాటి నుంచి సీనరేజీ ఎంత వసూలవుతుందో పరిశీలిస్తే గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎంత మేర ఎగ్గొట్టిందన్న విషయం కూడా అర్థమవుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాజా ఇసుక పాలసీలో ఇసుక ధర ఉచితం కాగా, కేవలం సీనరేజీ చార్జీల కోసం రూ.88 మాత్రం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం డంపింగ్ యార్డుల్లో టన్ను ఇసుక రూ.370గా నిర్ణయించి టన్నుకు రూ.88లు సీనరేజీ నిర్ణయించి స్థానిక సంస్థలకు జమ చేసేందుకు నిర్ణయించింది. రాబోవు కాలంలో టన్ను ఇసుక సుమారు రూ.275లకే ఇచ్చేవిధంగా నిర్ణయించే అవకాశం ఉంది.

● **వైసీపీ హయాంలో..**

గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక రేవుల వద్ద రూ.475 వంతున విక్రయించారు. ఉదాహరణకు సంగం పెన్నానది డీ సిల్ట్ పేరుతో మొదట్లో సుమారు 50 వేల క్యూబిక్ మీటర్ల (1.2 లక్షల టన్నులు) ఇసుకను తవ్వుకునేందుకు అనుమతించారు. పైసా సీనరేజీ చెల్లించలేదు. అదే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన మేరకు టన్నుకు రూ.88 సీనరేజీ చార్జీలు లెక్కిస్తే రూ.1.05 కోట్ల మేర స్థానిక సంస్థలకు సీనరేజీ జమకావాలి. కానీ ఇలా చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం దీనిని కూడా దారి మళ్లించినట్లు చెబుతున్నారు. సంగం రీచ్ నుంచి ఇలా రెండుసార్లు అనుమతి పొంది సుమారు 3 లక్షల టన్నుల ఇసుక విక్రయించారు. సీనరేజీలు సక్రమంగా చెల్లిస్తే ఒక్క సంగం రీచ్ నుంచే స్థానిక సంస్థలకు ఈ ఐదేళ్లలో సుమారు రూ.2.64 కోట్ల మేర అయ్యేది. అందులో 50 శాతం పంచాయతీకి ఇస్తే రూ.1.32 కోట్లు, మండల పరిషత్‌కు రూ.66 లక్షలు, మరో రూ.66 లక్షలు జిల్లా పరిషత్తులకు జమ అయ్యేది. ఒక్క రీచ్ నుంచే రూ. 2.64 కోట్లు స్థానిక సంస్థలు నష్టపోతే జిల్లాలో నిర్వహించిన రీచ్‌లు, గ్రావెల్, గ్రానైట్, కంకర క్రషింగ్ అన్ని కలిపితే ఎంత మొత్తంలో స్థానిక సంస్థలకు ఆదాయం చేకూరేందో అర్థమవుతుంది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న కొత్త ఇసుక పాలసీలో సీనరేజీ రూపంలో స్థానిక సంస్థలకు బలోపేతం కానున్నాయని పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

మినగల్లు రీచ్‌లో

ఇసుక తోడింది ఎంత!?

నిబంధనలకు పాతరేసి ఇష్టానుసారం తవ్వకాలు

లెక్కలు తేల్చకుండా కూటమి ప్రభుత్వానికి అప్పగింత

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 11 : గత ప్రభుత్వ హయాంలో మినగల్లు రీచ్‌లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై ఇప్పటికీ లెక్కలు తేలలేదు. సంగం మండల పరిధి నుంచి జొన్నవాడ వరకు పెన్నాలో ఇసుక అక్రమాల గోతుల లోయలు దర్శనమిస్తున్నా సర్వే, భూగర్భ జల శాఖ, మైనింగ్, ఇరిగేషన్, సెబ్ (శాండ్ కమిటీ) ఇతర అధికారులు ఏమీ ఎరుగనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2021, నవంబరులో పెన్నాకు వరద పోటెత్తి ఊళ్లు జలమయమైనా, ప్రజలు తీవ్రంగా నష్టపోయినా జగన్ సర్కార్ మాత్రం డిసెంబరు నుంచే జేపీ కంపెనీ మళ్లీ ఇసుక తవ్వకాలకు తెరలేపింది. అప్పటి నుంచి 2023 నవంబరు వరకు ఆ కంపెనీ మినగల్లు రీచ్ పరిధిలోని పెన్నమ్మను ఇష్టానుసారం కుళ్లబొడిచి లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక, తువ్వెసుకను తోడేసింది. జేపీ కంపెనీ, వైసీపీ నాయకులు వందల ఎకరాల్లో ఏరంతా జల్లెడపట్టి లక్షల క్యూబిక్ మీటర్లలో తవ్వకాలు జరిపి రూ.వేల కోట్ల మేర ప్రజాధనాన్ని పోగేసుకున్నారు. ఆ తరువాత ప్రతిమ గ్రూపు కూడా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంది. ఈ ఏడాది జనవరి 9న మినగల్లు రీచ్‌ను పరిశీలించిన వివిధ శాఖల అధికారులు, గుంతలను చూసి విస్తుపోయారు. ప్రతిమ గ్రూపునకు లీజు ఇచ్చేందుకు సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలపడంతో స్థానిక ప్రజలతోపాటు భూగర్భజలం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వారు వెనుదిరిగారు. మళ్లీ సర్వే చేయకుండా 2023 నవంబరు నుంచి 2024 మే 13న ఎన్నికలు జరిగే వరకు ఇష్టారాజ్యంగా ఇసుక తరలించిన ప్రతిమకు ఎలా అనుమతులొచ్చాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలా జగన్ సర్కార్ గుత్తేదారులను బినామీల పేరుతో ఏటిలో ఇసుకను కొల్లగొట్టింది. ఇప్పుడు ఏమీ తెలియనట్టు కొద్దోగొప్పో ఉన్న ఇసుక డంప్‌లను జిల్లా ఉన్నతాధికారులు, శాండ్ కమిటీ, సంబంధిత అధికారులు కూటమి ప్రభుత్వానికి అప్పజెప్పేసి చేతులు దులుపుకున్నారు.



ఇసుక తవ్వకాలతో పెన్నానదిలో ఉన్న గోతులు

భూగర్భ జలాల పెంపుదలకు ప్రణాళికలు తయారు చేయండి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : జిల్లాలో భూ గర్భ జలాలు పెంచేలా కొత్త పథకాలకు ప్రణాళికలు త యారు చేయాలని కలెక్టర్ ఆ నంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో కేంద్ర భూగర్భ జలమండలి ఆధ్వర్యంలో టైర్ త్రీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే చెక్‌డ్యామ్‌లు, వాటర్ షెడ్లలో ఎక్కువ స్థాయిలో భూగర్భ జలాలు నిల్వఉండేలా డిజైన్లు తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరాశాఖ చేపట్టే పనులు భూగర్భ జలాలు పెరిగేలా దృష్టిలో ఉంచుకొని చేయాలన్నారు. జిల్లాలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగు నీరు వినియోగించుకునే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణలో జిల్లాలో భూగర్భ జలాలను తెలియచేసే ఫొ టో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భూగర్భ జలమండలి డీడీ జీ కృష్ణమూర్తి, కేంద్ర భూగర్భ జలశాఖ శాస్త్రవేత్త రవి కుమార్, డ్వామా పీడీ బీ. శ్రీనివాసులు, డ్వామా ఏపీడీ శంకర్, జిల్లా భూగ ర్భజలశాఖ డీడీ ఆర్.శోభన్‌బాబు, వ్యవసాయ, ఉద్యాన, డ్వామా, డీఆర్ డీఏ, ఏపీ మైక్రో ఇరిగేషన్‌శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సోమశిలలో

9.954 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 11: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి డ్యాంలో 9.954 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 144 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 600, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్

ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం

● వచ్చే నెల వరకు గడువు

నెల్లూరు (విద్య), జూలై 11: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది కూడా ఆగస్టు 31వతేదీలోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ స్కాలర్‌షిప్స్ డాట్ జీవోవీ డాట్ ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు అందచేయాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు కూడా ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రతివి ద్యార్థి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకుని వెంటనే తమ అప్లి కేషన్‌ను సబ్మిట్ చేయాలన్నారు. వి ద్యార్థులు తమ వివరాల్లో ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా మెరిట్‌లిస్ట్‌లో ఉన్న విధంగానే ఆధార్‌లో ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకాల్లో తప్పులుంటే వెం టనే సరిచేయించుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ లో పరిశీలించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు నెల్లూరు దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ● నగరంలో ర్యాలీ నిర్వహణ

● ప్రతిభ చూపిన వైద్యులకు నగదు బహుమతులు

నెల్లూరు (వైద్యం) జూలై 11: జిల్లాలో జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ములుముడి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ భూమిపై వనరులు చాలా తక్కువగా ఉన్నాయని, జనాభా నియంత్రణ చేపట్టకపోతే ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుందని చెప్పారు. అడిషినల్ డీఎంహెచ్‌వో ఖాదర్ వలి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించినట్లయితే సమాజాభివృద్ధికి ఎంతో దోహదం చేసిన వారవుతారని చెప్పారు. అనంతరం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు లక్కీడిప్ ద్వారా మొదటి బహుమతి కింద ముగ్గురికి రూ.5వేలు, రెండవ బహు మతి కింద ముగ్గురికి రూ.4వేలు అందించారు. అలాగే కుటుంబ నియం త్రణలో ప్రతిభ చూపి మొదటి బహుమతి సాధించిన ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కిరణ్‌కు రూ. 8వేలు, రెండవ బహుమతి కింద కావలి ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పద్మావతికి రూ. 5వేలు అందచేశారు. అలాగే జీజీహెచ్‌లో పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, ఎస్‌వో సహన, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, బొల్లినేని, దుర్గా నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

జోరందుకున్న సాగు

ఉదయగిరి రూరల్, జూలై 11: ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంది. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో పసుపు, వేరుశనగ, సజ్జ, రాగి తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని కొండకిందపల్లెల్లో రైతులు విస్తారంగా పసుపు సాగు చేపడుతున్నారు. ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది పసుపు పుట్టి ధర రూ.8వేలు పలికింది. దీంతో పసుపు పంట సాగు చేసిన రైతుల ఇంట సిరులు కురిపించింది. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో పసుపు పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు.

మంచి గుణపాఠం నేర్పారు!

● జీవితంలో ఇక్కడి అధికారులను మర్చిపోను ● సహచరుల వద్ద వాపోయిన కమిషనర్ వికాస్



నెల్లూరు (సిటీ), జూలై 11 : 'నెల్లూరులో ఇన్నాళ్లు పని చేసినందుకు మంచి గుణపాఠం చెప్పారు. ఇక్కడ అధికారులను జీవితంలో మరచిపోలేను.' అంటూ బదిలీపై వెళ్తున్న కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ సహచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇటీవల కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై తన పేరిట ఫిర్యాదును పోలీసులకు అందచేయాలని కార్పొరేషన్‌లోని కొందరు అధికారులను ఆయన ఆదేశించగా, అందుకు వారు అంగీకరించలేదని సమాచారం. సిటీ ప్లానింగ్ విభాగం కేంద్రంగా ఫోర్జరీ స్కాం నడిచినందున ఆ విభాగం అధికారులే తన పేరిట ఫిర్యాదు ఇవ్వాలని సూచించినా తన ఆదేశాలను సైతం తిరస్కరించడం బాధ కలిగించిందని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్పొరేషన్‌లో అధికారుల పక్షాన నిలబడి నాయకుడిగా ముందుకు తీసుకెళ్తే ఒక్కరు కూడా తనకు ఫోర్జరీ స్కాంలో తోడు నడవలేదని, ఇలాంటి అధికారులతో పని చేశానా? అన్న బాధ నెలకొందని అన్నట్లు సమాచారం. ఒక ఐఏఎస్ అధికారికి ఇక్కడ ఎంత మాత్రం గౌరవం ఇస్తారో అర్థమైందంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా ఫోర్జరీ స్కాంను తాను ఎక్కడున్నా వదలనని స్పష్టం చేసినట్లు సమాచారం.

కొడవలూరులో

యుద్ధ ట్యాంక్‌లు



రైలులో ఉన్న ఆర్మీ ట్యాంక్‌లను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

కొడవలూరు, జూలై 11: ఆర్మీ పేరు వింటేనే దేశభక్తితో ఒళ్ళు పులకరిస్తుంది. ఆర్మీ దుస్తులు వేసుకున్న జవాన్‌ను చూసినా లేదా వాళ్ళు వాడే ఆయుధాలు, మిలటరీ వాహనాలు చూసినా తెలియని అను భూతి కలుగుతుంది. అలాంటి సన్నివేశం కొడవలూరు రైలు గేటు వద్ద గురువారం చోటుచేసుకోంది. ఇండియన్ ఆర్మీ ట్రైన్ కొడవలూరు మీదుగా యుద్ధ ట్యాంక్‌లను తీసుకొని వెళ్తుండగా జనం ఆసక్తిగా తిలకించారు. మరికొందరు వాహనాలు దిగి మరీ దేశభక్తి చాటుకున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రైతుబజార్లలో అందుబాటు ధరలకు నిత్యావసరాలు

● పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు

కందుకూరు, జూలై 11: ప్రజలకు అందుబాటు ధరలో నిత్యావసర సరుకులు అందించేలా రైతుబజారులో నిత్యావసరాల విక్రయకేంద్రాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. కందుకూరు సబ్ కలెక్టరు జి విద్యాధరితో కలిసి ఆయన పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నందున సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ. 181 రూపాయలు ధర పలుకుతుండగా ఇక్కడ కేవలం 160 రూపాయలకే వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకున్నామని, అలాగే బియ్యం కిలో రూ. 55కి పైనే ఉన్నందున ఈ కేంద్రంలో 49 రూపాయలకే అందించనున్నట్లు వివరించారు. స్టీమ్డ్ బియ్యం కిలో రూ. 49కి, పచ్చిబియ్యం రూ. 48కి వినియోగదారులు పొందవచ్చునన్నారు. అత్యంత నాణ్యమైన సరుకులు ఈ కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో ఇతరత్రా అవసరమైన నిత్యావసర వస్తువులను కూడా ఇక్కడ అందుబాటులో ఉంచటం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా రైతుబజారులో ఆయన షాపులన్నింటినీ పరిశీలించారు. పరిశుభ్రంగా నిర్వహించకపోవటం పట్ల ఎస్టేట్ అధికారి పద్మనాభంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితిని మెరుగుపరచాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు ఎమ్మెల్యే నాగేశ్వరరావునును రైతుబజారులోని రైతులు, వ్యాపారులు ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె చెంచురామయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రైతుబజారులో నిత్యావసరాల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు విద్యాధరి

నారా లోకేష్‌ను కలసిన కమ్మ ప్రభాకర్



నారా లోకేష్‌తో ప్రభాకర్‌నాయుడు

అనంతసాగరం, జూలై 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను అనంతసాగరంవాసి పార్లమెంటు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు గురువారం ఉండవల్లిలో కలిశారు. ఈ సందర్భంగా అనంతసాగరం మంలంలోని ప్రధాన సమస్యలను ఆయనకు వివరించి పరిష్కరించాలని కోరారు.

వ్యవసాయ కార్యాలయం పరిశీలన

అల్లూరు, జూలై 11: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండడం లేదంటూ స్థానిక రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఆమె వ్యవసాయ కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులకు అవసరమైన జిప్సం, జింక్ అందుబాటులో ఉంచేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగరాజు, సిబ్బంది రామకృష్ణ, రైతులు మేడా నిరంజన్‌రెడ్డి, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

సచివాలయానికి చిత్రపటాల బహూకరణ

కలిగిరి, జూలై 11: నాగసముద్రం గ్రామ సచివాలయానికి బుధవారం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చీమల తాతయ్య, బాపతి చినమాలకొండయ్య, అంబటి శంకరయ్య, నరసాల మాల్యాద్రి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు డార్మెంటరీ నిర్మాణం

అనంతసాగరం, జూలై 11: రేవూరు బీసీ బాలికల వసతి గృహంలో గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బోయళ్ల జనార్ధన్‌రెడ్డి తన సతీమణి లక్ష్మీతేజ జ్ఞాపకార్థం డార్మెంటరీని నిర్మించారు. గురువారం ఆయన కుమార్తె బోయళ్ల సాయి ప్రవర్తిక భవనాన్ని ప్రారంభించారు. వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకోగా విద్యార్థుల సౌకర్యార్థం డార్మెంటరీని అందుబాటులోకి తెచ్చిన దాతను జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూ శ్రీదేవి, వార్డెన్ మలేశ్వరీ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు తుది కౌన్సెలింగ్ ప్రారంభం

కావలి రూరల్, జూలై11: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్ షెడ్యూలును సాంకేతిక విద్యాశాఖ అధికారులు విడుదల చేసినట్లు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కౌన్సిలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగే ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. రెండవవిడత ధ్రువపత్రాల పరిశీలన నెల్లూరు వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతాయన్నారు. ఆప్షన్ల నమోదుకు జూలై 14వ తేదీ వరకు సమయం కేటాయించినట్లు తెలిపారు. 16వ తేదీ నిర్దేశించగా 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ అయ్యి కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు

చెరువు మట్టి అక్రమంగా తరలింపు

చిట్రగుంట, జూలై 11: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీలోని చెరువులోని మట్టిని కొందరు వ్యక్తులు రాత్రి పగలు తేడా లేకుండా గురువారం యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. చెరువులో నీరు తగ్గడంతో ఎక్కడ పడితే అక్కడ లోతైన గోతులు తీస్తున్నారు. అక్రమార్కులకు కావల్సిన మట్టిని ఎక్స్‌కవేటర్‌తో ట్రాకటర్లలో నింపుకుని గ్రామాల్లో నుంచే తరలిస్తున్నారు. పేదవాడు తట్టెడు మట్టి తీసుకుపోతుంటే పట్టుకుని కేసులు రాసే పోలీసులు ఈ విషయంతో ఉలుకుపలుకు లేకుండా చోద్యం చూస్తున్నారు. బోగోలు చెరువులో కూడా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి, గ్రావెల్ తరలింపులు కొనసాగుతున్నాయి. ఈ విషయమై తహసీల్దారు వెంకటరత్నంను వివరణ కోరగా ఎవరికీ తాము అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. చెరువులో మట్టి తరలింపు విషయం రెవెన్యూ అధికారులకు సంబంధించిందని ఎంపీడీవో అన్నారు.

పాదయాత్రకు మద్దతు

చిట్రగుంట, (దగదర్తి) జూలై 11: దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు, ఆయన అనుచరుల బృందం దగదర్తి మండలం నుంచి పొదలకూరుకు గురువారం చేరుకుంది. ఈ పాదయాత్రకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు సంఘీభావం తెలిపారు.

రేపు కావలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

కావలి, జూలై11: మున్సిపాల్టీ పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ వై.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం రానున్న దృష్ట్యా విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు మరమ్మతు పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

కందుకూరు, జూలై 11: అభివృద్ధిలో భాగంగా చేపట్టే ప్రతిపనిలో నాణ్యత పాటించాల్సిందేనని ఎక్కడా నాణ్యతా లోపాన్ని సహించేదిలేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు మున్సిపాలిటీలో 55 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమిపూజ నిర్వహించారు. గాయత్రీనగర్‌లో రూ. 25.17 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ, 2వ వార్డు ఉర్దూస్కూల్ వద్ద రూ. 15.29 లక్షలతో సీసీ రోడ్డు, 32వ వార్డు శ్రీచైతన్య విద్యాలయం వెనుక 14.53 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిమెంటురోడ్డు నిర్మాణ పనులకు ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారుల పర్యవేక్షణా లోపం ఉన్నట్లు ఫిర్యాదులొచ్చినా సహించేది లేదని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖామంత్రి నారాయణతో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకురావటం జరుగుతుందని, మున్సిపాలిటీలో ఇక నిరంతరం అభివృద్ధి పనులు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. భూమిపూజ సందర్భంగా ఆయా ప్రాంతాలలో స్థానికుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, పొడపాటి నాగేశ్వరరావు, బత్తిన మాల్యాద్రి, దారం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల అక్రమ వసూళ్లను అరికట్టండి

అల్లూరు, జూలై 11: నార్తుమోపూరులో ఇంటి పన్ను అక్రమ వసూళ్లను అరికట్టి, వసూళ్లకు పాల్పడగా వచ్చిన నగదు రికవరీ చేయడంతో పాటు వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు రేబాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు గురువారం కమిషనరు ఫణికుమార్‌ను కోరారు. ఈ విషయంపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నార్తుమోపూరు సచివాలయ కార్యదర్శి వరప్రసాద్ ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడ్డారని వినతిలో పేర్కొన్నారు. పన్ను నగదును వసూలు రశీదును ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకొని రశీదును కూడా ఆన్‌లైన్ ఫార్మాట్‌లో మంజూరు చేయక మ్యానువల్ రశీదులు ఇచ్చారన్నారు. అంతేకాకుండా అనేకమంది వద్ద నగదు తీసుకొని రశీదులు కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ప్రజలకు పొంతనలేని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఇదంతా స్థానికంగా ఉండే ఓ వ్యక్తి ద్వారా అధికారి తతంగం జరిపించారన్నారు. నగదు పంపిణీ విషయంలో వారిరువురి మధ్య అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఆ వ్యక్తిని సదరు అధికారి తొలగించారన్నారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకొని ఇలా అక్రమంగా సదరు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవలని కమిషనరును కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సదరు అధికారిపై పోలీసు కేసు నమోదు చేయించడంతోపాటు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్టూరు విజయకుమార్ రెడ్డి, కోనంరెడ్డి సత్యం, కేతిరెడ్డి శివారెడ్డి, పొన్నగంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచి రేబాల తదితరులు

ట్రంకు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

కావలి, జూలై 11: పట్టణం దక్షిణ శివారు నుంచి ముసునూరు శివారు వరకు గుంటలు మిట్టలుగా ఉన్న రోడ్డునకు అధికారులు గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని ఆ గుంటలు, మిట్టలకు కంకర మిక్సింగ్ వేయించి చదును చేయిస్తుండటంతో వాహన చోదకులు, ముసునూరు ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్డులో ప్రయాణం ఒక నరకంగా ఉండేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇంటి సమీపంలో రోడ్డు మరీ అధ్వానంగా ఉండి చిన్న వర్షం పడినా అక్కడ చెరువును తలపించేదని చెప్పారు. వాస్తవంగా ట్రంకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా ఆ కాంట్రాక్టర్ ఆదాయం వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలను కొంత మేరకు చేపట్టి వదిలివేశారు.

పూడికతీత, రోడ్డు వెడల్పు పనుల ప్రారంభం

కావలి, జూలై 11: పూడికతో నిండిన మురుగు కాలువలను శుభ్రం చేయడం, కంపచెట్లతో కుదించుకు పోయిన రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు గురువారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 19వ వార్డులోని బైరాగుల కాలనీ, బీరువాల ఫ్యాక్టరీ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను టౌన్ ప్లానింగ్ అధికారి బాబూరావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలిలో అధ్వానంగా ఉన్న డ్రైన్లు, రోడ్లను గుర్తించి వాటికి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. వర్షాకాలం వస్తుండటంతో పూడికతో నిండిన డ్రెయిన్లలో వర్షపునీరు పోయేందుకు ఇబ్బందులు లేకుండా పూడికను ఎక్స్‌కవేటర్‌లతో తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలో అనేక చోట్ల రోడ్లు కంపచెట్లు, చెత్తా చెదారంతో మూసుకుని పోవటంతో వాటిని తొలగించి రోడ్లను వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజనలో తొలి రుణం మంజూరు

సంగం, జూలై 11: స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో పీఎం విశ్వకర్మ యోజన పథకంలో కార్పెంటర్ పెనుబర్తి సురేష్ ఆచారికి జిల్లాలో తొలి రుణం రూ.లక్ష మంజూరయ్యింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మధుసూధన్‌రావుతో కలిసి విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి మాట్లాడారు. చేతివృత్తిదారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు పీఎం ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఏలూరు బాబుఆచారి, రఘునాథ్‌ఆచారి, రఘురామయ్యాచారి, వరప్రసాద్ ఆచారి, శివప్రసాద్ ఆచిరి తదితరులు పాల్గొన్నారు.

విట్స్‌లో పీఎం ఉపాధి కల్పన జిల్లా స్థాయి సదస్సు

కావలిటౌన్, జూలై 11: గ్రామీణ పరిశ్రమల స్థాపన ద్వారా స్వయం ఉపాధి కల్పన పొందవచ్చని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమీషన్ డైరెక్టర్, డాక్టర్ గ్రూప్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ విట్స్ కళాశాలలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో పాల్గొన్న కోటిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాదికారి సుధాకర్, జిల్లాస్థాయి బ్యాంకుల అధికారి ప్రవీణ్‌లు పాల్గొన్నారు. గ్రామీణ పరిశ్రమలు ఎలా స్థాపించాలి వాటితో యువత స్వయం ఉపాధి పొందే అవకాశాలు, బ్యాంకుల నుంచి రుణాలు ఎలా పొందాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరీష్ గాంధీ, డాక్టర్ మధుకర్, డాక్టర్ రజ్వి తదితరులు పాల్గొన్నారు.

బడాబాబులు నా భూమిని ఆక్రమించారు !

● న్యాయం చేయాలని బాధితుడి మొర

కావలి, జూలై 11: పట్టణంలోని బడా బాబులు పెట్రోల్ బంకు నిర్మాణం కోసం తన భూమిని కొంత ఆక్రమించుకుని వారి స్థలంలో కలుపుకున్నారని బాధితుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి వాపోయారు, కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముసునూరులోని 154, 158, 162 సర్వే నంబర్లలో 1993లో తనకు 2ఎకరాలను రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారన్నారు. తాను సాగుచేసుకుంటున్న ఆ భూమి పక్కనే అక్కడ నిర్మాణాలు చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అనుచరులు కొందరు స్థలాన్ని ఆక్రమించుకున్నారని చెప్పారు. దానికి మాజీ ఎమ్మెల్యేతోపాటు రెవెన్యూ అధికారులు కూడా సహకరించారని చెప్పారు. దీంతో వారు తనకు పట్టా ఇచ్చిన భూమిని ప్రభుత్వం నుంచి నామినల్ రేట్‌కు తీసుకునేందుకు ఫైలు సిద్ధం చేసినట్లు తెలిసిందన్నారు. తాను కోర్టును ఆశ్రయించినా ఆక్రమణదారులు పట్టించుకోవటం లేదని చెప్పారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బాధితుడు వెంకటేశ్వరరెడ్డి

లార్వా నిర్మూలనకు చర్యలు

ఆత్మకూరు, జూలై 11 : డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా గురువారం వాశిలిలో లార్వా నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో గాంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో ఆత్మకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ ఖాదర్‌బాష, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులతో బహుళ ప్రయోజనాలు



దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మాట్లాడుతున్న తహసీల్దారు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 11: అర్హులైన ప్రతిఒక్కరికి కౌలు రైతు కార్డులు అందజేయనున్నట్లు తహసీల్దారు యశోద, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 346 మంది రైతులకు కౌలు కార్డులు అందించడమే లక్ష్యమన్నారు. కౌలుకార్డు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలను తెలిపారు.

ఉదయగిరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కౌలు రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఆర్వోలు, వీఏఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు.

సీతారామపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డిల అధ్యక్షతన మండలంలోని వీఆర్వోలు, వీఏఏలకు కౌలురైతులకు కౌలుపత్రాల పంపిణీపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 12వ తేదీ నుంచి 5 రోజుల పాటు 9రైతు సేవా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించి, మన మండలానికి ప్రభుత్వం కేటాయించిన 367 టార్గెట్‌ను రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కౌలు రైతులకు సర్టిఫికెట్ ఇవ్వడంతో రైతులు బ్యాంక్ లోన్, ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ పథకాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, ఏఈఓ పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు గోపికృష్ణ, వ్యవసాయశాఖ అధికారి వి.శశిధర్ పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులకు సీఆర్‌సి కార్డులు మంజూరు చేస్తారని, అవి ఎలా పొందాలి, ఎలంటి పత్రాలు కావాలి, వాటి ఉపయోగాలు వివరించారు. రైతు సేవా కేంద్రాలలో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏవో వి.శశిధర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అశోక్, ఎఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం కౌలు రైతులకు కార్డులు పొందుటకు కావాల్సి అర్హతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలుదారునికి వ్యవసాయ పంటలకు కనీసం ఏకరం, ఉద్యావన పంటలకు ఏకరం లోపు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందు కోసం తగిన ధృవీకరణ పత్రాలతో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో)ను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సంజీవకుమారి, వ్యవసాయాధికారి ప్రతాప్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


నర్రవాడకు తరలిన భక్తులు



ఊరేగింపుగా నర్రవాడ వెళుతున్న భక్తులు

ఉదయగిరి రూరల్, జూలై 11: సున్నవారిచింతల గ్రామానికి చెందిన భక్తులు వెంగమాంబ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగింపుగా గురువారం నర్రవాడకు తరలివెళ్లారు. నర్రవాడ వెంగమాంబ సన్నిధిలో 16 రోజుల ఉత్సవం జరుగుతున్నట్లు వారు చెప్పారు.

భక్తులకు వసతులు కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జూలై 11: రొట్టెల పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని దర్గాకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీవో మధులత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు.

దర్గా కోనేరులో చేపల విడుదల

ఏఎస్ పేట, జూలై 11: నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నారు. దీంతో గురువారం వైద్యఆరోగ్య అధికారులు గంబూసియా చేపలను కోనేరులో వదిలారు. ఈ చేపలు దోమల లార్వాను తినేస్తాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఖదర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల సాగుపై అవగాహన

కావలి టౌన్, జూలై 11: పట్టణ ముసునూరులోని కల్యాణ మండపంలో గురువారం రొయ్యల సాగులో వ్యాధులు నియంత్రణ నివారణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా థాయ్‌లాండ్‌కు చెందిన కెసిస్టర్ యూనిర్సిటీ ప్రొఫెసర్ ప్రవంశాక్ పాల్గొని రొయ్య సాగులో వ్యాధుల గురించి వాటి నియంత్ర నివారణ గురించి రైతులకు డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శనాత్మకంగా వివరించారు. అవంతి ఫీడ్స్ నిర్వాహకులు అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ సీనియర్ జీఎం.పరేష్‌కుమార్ శెట్టి, జీఎం శ్రీనివాస్ మహంతి, నారాయణ రెడ్డి, నాగేశ్వరరావు, జయచంద్రా నాయుడు, రమేష్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

బిట్రగుంట, జూలై 11: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు గోవిందరాజు డిమాండ్ చేశారు. సానిక రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం వద్ద సంఘ్ బ్రాంచ్ కార్మికులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎస్‌ఎఫ్‌ఐఆర్ జనరల్ సెక్రెటరీ రాఘవయ్య ఆదేశాల మేరకు 12వ తేదీ జోనల్ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు పవన్‌కుమార్, సుదాకర్, సంఘ్ సభ్యులు, కార్మికులు ఉన్నారు.

జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



ఏఎస్ పేటలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

ఏఎస్ పేట, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు సురేష్, మంజుల ఆదేశాలతో గురువారం వైద్యఆరోగ్య సిబ్బంది వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మనవహారం నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అధికారులు, ఎఎన్‌ఎంలు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు శివకల్పన, వినీతలు మాట్లాడుతూ జనాభా నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చిన్నకుటుంబం చింతలేని కుటుంబమని, కాన్పు మధ్య ఎడం తల్లీబిడ్డలకు ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు హసనయ్య, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన

సంగం, జూలై 11: మర్రిపాడు రైతు సేవా కేంద్రంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ జయచంద్ర మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకం రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందచేస్తుందన్నారు. రాయితీలో సీడ్స్ పంపిణీ చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి దిగుబడి ద్వార మంచి లాభాలు గడించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి సుజని, వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట : గుంపార్లపాడు, జమ్మవరం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో గురువారం పంట సాగుపై అవగహన మండల వ్యవసాయ అధికారి రజిని అవగాహన కల్పించారు. ఈ నెల 20వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, వీఆర్‌వో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : పశు పోషకులు అధిక పాల దిగుబడి ఇచ్చే గ్రాసాలు సాగు చేసుకోవాలని మండలంలోని వీఆర్ కోట పశు వైద్యాధికారి డా.వై శ్రీకాంత్ చెప్పారు. పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా గురువారం వీఆర్ కోటలోని పశు వైద్య కేంద్రంలో పశు పోషకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాడి రైతు తనకున్న భూమిలో కనీసం 10 సెంట్లలో అధిక పాల దిగుబడి ఇచ్చే గ్రాసాలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణన సహాయకులు సీహెచ్ మహేంద్ర, సిబ్బంది జె ప్రవీణ్, పి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

కన్వర్షన్ భూమి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

ఉదయగిరి రూరల్, జూలై 11: మండలంలోని కుర్రపల్లి వద్ద ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని గురువారం ఆత్మకూరు ఆర్డీవో మధులత పరిశీలించారు. అనంతరం ఉదయగిరి ఆనకట్ట వద్ద టూరిజం శాఖకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించారని కొందరు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నిర్వహించి ఆక్రమణ జరిగి ఉంటే తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు పీవీ కృష్ణారెడ్డి, వీఆర్వోలు వెంకట్, అనూష, సర్వేయర్లు రవి, మీరావలి, సిబ్బంది పాల్గొన్నారు.

తీరు మారకపోతే చర్యలు తప్పవు

ఉదయగిరి, జూలై 11: ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా పనితీరు మారకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ హేనాసుజనా హెచ్చరించారు. గురువారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉండాలన్నారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందేలా చూడాలన్నారు. రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నారని, ఆయా గ్రామాల ప్రజలు తమ ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి కార్యకర్తలను ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో పద్మజ, సూపర్‌వైజర్లు తేజస్విని, షాను పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో రూ.2.15లక్షల అక్రమాలు

ఏఎస్ పేట, జూలై 11: మండలంలో 2023-2024 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో రూ.2.15లక్షల అక్రమాలు జరిగినట్లు గుర్తించి వాటి రికవరీకి ఆదేశించినట్లు ఉపాధిహామీ అడిషనల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని 19 పంచాయతీల్లో 975 పనులకు రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. దీనిపై గత కొన్నిరోజులుగా సామాజిక తనిఖీ అధికారులు ఈ అక్రమాలు తేల్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



సంగం: పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న టీడీపీ నేతలు

సంగం, జూలై 11: దగదర్తి మండలం కాట్రాయపాడుకు చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత మండల పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్ నాయుడు స్వగ్రామం నుంచి చేపట్టిన తిరుమల పాదయాత్ర గురువారం ఉదయం సంగం కూడలికి చేకుకుంది. మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు తమ గ్రామం నుంచి పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు.

పాదయాత్రకు కలిగిరి వాసుల మద్దతు

కలిగిరి : కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించడంతో ఆయన వీరాభిమాని నూకరాజు మదన్‌కుమార్ చేపట్టిన మాలకొండ పాదయాత్ర గురువారం మండలంలోని కమ్మవారిపాలెంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ తెలుగుదేశం నాయకుడు గన్నమనేని శ్రీనివాసులు సన్మానం చేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిగిరి పట్టణం వరకు పాదయాత్ర నిర్వహించారు. కలిగిరి పట్టణంలో మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతుకార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, నాయకులు మాదాల శ్రీనివాస్, లెక్కలరాంబాబు, గొల్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

వరిణి పంచాయతీలో పారిశుధ్య పనులు

● చెత్త ఊడ్చిన టీడీపీ నాయకులు

విడవలూరు, జూలై 11 : మండల పరిధిలోని వరిణి పంచాయతీలో సాధారణ నిధులు దుర్వినియోగం కావడంతో పారిశుధ్య పనులు అటకెక్కాయి. దీంతో గ్రామంలో ఎక్కడచూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. పంచాయతీలో ఎటువంటి సమస్యలు లేకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలు జారీచేసి వున్నారు. ఆమె ఆదేశాల మేరకు గురువారం వీరారెడ్డిపాలెం టీడీపీ నాయకుడు తుళ్లూరు మాధవ్ ఆధ్వర్యంలో సుమారు 200మంది కార్యకర్తలు, మహిళలు గ్రామంలోని చెత్తాచెదారాలను స్వయంగా శుభ్రం చేశారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు తుళ్లూరు మాధవ్ మాట్లాడుతూ వరిణి పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న వైసీపీ నాయకుడు మల్లికార్జున్ ప్రజలు కడుతున్న ఇంటి పన్నులు, ఇతర పన్నులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇందుకు పంచాయతీ బినామీ సెక్రటరీ ప్రసాద్ వంత పాడుతూ ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడంలేదని ఆరోపించారు. పంచాయతీలో ఎంతమంది పారిశుధ్య కార్మికులు ఉన్నారో తెలియడం లేదన్నారు. వసూలు చేస్తున్న సాధారణ నిధులు ఎంతవరకు ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయో తెలియడం లేదన్నారు. దీనిపై పంచాయతీ అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, రఘు, సురేంద్ర, రామస్వామి, జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



వీరారెడ్డిపాలెంలో చెత్తను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

జనాభా పెరుగుదల అభివృద్ధిపై ప్రభావం



మాట్లాడుతున్న డీకేడబ్ల్యూ జూ.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

నెల్లూరు (విద్య), జూలై 11 : జనాభా పెరుగుదల సామాజిక, పర్యావరణ, వ్యక్తిగత ప్రయోజనాలపై ప్రభావం చూపిస్తుందని డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, సెక్టార్ మేనేజర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, సెక్టార్ సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రత్నంలో ప్రపంచ జనాభా దినోత్సవం : నగరంలోని సరస్వతి నగర్ డాక్టర్ కిషోర్స్ రోషిణి రత్నం పాఠశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులతో చర్చలు నిర్వహించారు. అనంతరం వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీలేదు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 11 : రొట్టెల పండుగకు వచ్చే లక్షలాది మంది భక్తులకు తగిన వసతులు కల్పించడంలో రాజీపడేది లేదని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బారాషహీద్ దర్గాలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా టౌను ప్లానింగ్ అధికారులు రూపొందించిన మ్యాప్‌ను పరిశీలించారు. వారికి సూచనలు ఇచ్చారు. అనంతరం దర్గా చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, మాజీ చైర్మన్‌లు సయ్యద్ సమీ, అబూబకర్, మాజీ కార్పొరేటర్ షంషుద్దీన్, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి దర్గాలో పర్యటించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, ఆరోగ్య శిబిరాలు, భారీ వర్షం వస్తే భక్తులకు వసతి వంటివి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షాబీర్‌ఖాన్, రసూల్, మునీర్, జాఫర్‌ఖాన్, రహమత్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



దర్గా పెస్టివల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు

వైభవంగా పెద్ద వెండినంది సేవ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 11: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారికి గురువారం పెద్ద వెండినంది సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈసందర్భంగా స్వామి, అమ్మవారు గ్రామంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణతో పెద్ద వెండి నందిసేవ ఊరేగింపు భక్తులను అలరించింది.

ప్రైవేటు లేఅవుట్ల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : మండలంతోపాటు బుచ్చి నగర పంచాయతీలో పలు ప్రైవేటు లేఅవుట్లను అమరావతి, గుంటూరు నుంచి వచ్చిన పలువురు నుడా అధికారులు బుచ్చి నగర పంచాయతీ కమిషనర్ రమణబాబుతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా వారు జొన్నవాడ నుంచి పెనుబల్లిలో రోడ్డు వెంబడి వున్న లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం బుచ్చి నగర పంచాయతీలోని పలు లేఅవుట్లను పరిశీలించారు. మొత్తం జిల్లాలో 2019 నుంచి ఏర్పాటైన అధికారిక, అనధికారిక లేఅవుట్లు మాత్రమే పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు వారు తెలిపారు. లేఅవుట్లను పరిశీలించేందుకు వచ్చిన వారిలో అమరావతి నుంచి నుడా జాయింట్ డైరెక్టర్, గుంటూరు నుంచి డిప్యూటీ, అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వేయర్లుతో పాటు మండలంలోని సర్వేయర్లు వున్నారు.

అనికేపల్లిలో ఉచిత దంత వైద్యశిబిరం



దంతవైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లిలో నెల్లూరుకు చెందిన నారాయణ దంత వైద్యశాల సహకారంతో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. దంతవైద్య నిపుణులు డాక్టర్ వందిత, డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ నరేష్ ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, చెమికల కిష్టయ్య, షేక్ మౌలాలి, పెనుమల్లి వెంకటేష్, చెమికల పుట్టయ్య, మందల మణి, పచ్చికల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డులపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు : ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చే కౌలుకార్డుల ద్వారా పట్టాదారుడికి ఎలాంటి నష్టం జరగబోదని తహసీల్దార్ చిరంజీవి స్పష్టంచేశారు. స్థానిక ఆర్బీకేలో పంట సాగుదారుల హక్కుల కార్డులపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూమి పత్రాలు ఇచ్చినంత మాత్రాన కౌలురైతులకు మీ భూమిపై ఎలాంటి హక్కులు సంక్రమించవన్నారు. కేవలం పంట సాగులో ఉన్నప్పుడు మాత్రమే కార్డుల ద్వారా రైతులకు సబ్సిడీలు, బ్యాంకు రుణాలు ఉపయోగపడతాయన్నారు. అంతేతప్ప కౌలు రైతులకు ఇచ్చే కార్డుల వలన భూమి కలిగిన రైతులకు ఇబ్బందులు రావన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జహీర్, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, టీడీపీ నేత రాయపాటి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బోర్డు వివాదంతో మూతపడ్డ వాటర్‌ప్లాంట్

మనుబోలు, జూలై 11: మండలంలోని అక్కంపేటలో బోర్డుల వివాదాలతో గురువారం వాటర్‌ప్లాంట్‌ను మూసేశారు. దీనిపై జిల్లా కాంగ్రెస్ నాయకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ పంచాయతీల అనుమతితో కొద్ది సంవత్సరాలుగా అక్కంపేట, ముద్దమూడిలో వాటర్‌ప్లాంట్ ద్వారా తన సొంతనిధులు వెచ్చించి పలు గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. తనకు వైఎస్‌ఆర్‌పై ఉన్న అభిమానంతో వాటికి రాజన్న జలధార బోర్డులు పెట్టామన్నారు. టీడీపీ నాయకులు ఆ బోర్డులను పీకేసి వాటికి ఎన్‌టీఆర్ జలధార బోర్డులు పెట్టడం సరికాదని, దీనిపై కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా, వాటర్‌ప్లాంట్ వద్దకు టీడీపీ, బీజేపీ నాయకులు రావడంతో వివాదం తలెత్తకుండా అక్కడకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ చేరుకుని రెండు బోర్డులు పీకేసి వాటర్‌ప్లాంట్‌ను మూసివేయించారు. శుక్రవారం ఎంపీడీవో రికార్డులు పరిశీలించి చెప్పిన తరువాత వాటర్‌ప్లాంట్ తీయాలని నిర్ణయించారు.

టీడీపీతో రాష్ట్రానికి మంచి రోజులు



తిరుమలకు పాదయాత్ర చేస్తున్న బాపట్ల టీడీపీ నేతలు

మనుబోలు, జూలై 11: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం రావడంతో మంచిరోజులు వచ్చాయని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం టీడీపీ అధికార ప్రతినిధి మధుసూదన్‌రావు అన్నారు. ఈనెల 1న వేమూరులో చేపట్టిన తిరుమల పాదయాత్ర గురువారం మనుబోలు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలన పోవాలని తిరుమల వెంకన్నను మొక్కుకున్నామని, ఆ మొక్కు తీర్చేందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు. పాదయాత్రకు మనుబోలు టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్,కలికి రమేష్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ఎంపిక

పొదలకూరు, జూలై 11 : మండలంలోని పొదలకూరు, విరువూరు, తోడేరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పొదలకూరు డీఎన్‌ఆర్ జడ్పీ హైస్కూల్‌కి చెందిన కె స్నేహిత, బుజ్జా హిమవర్ష, విరువూరు హైస్కూల్‌కి చెందిన అవ్వారి భవ్య చరితలు ఎంపికయ్యారు. స్నేహితకు పదో తరగతిలో 576 మార్కులు, హిమవర్షకు 570 మార్కులు రాగా, అవ్వారి భవ్యచరిత 569 మార్కులు పొంది ఈ సీట్లకు అర్హత సాధించారు. వీరిలో హిమవర్ష, భవ్యచరితకు ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ సీట్లు లభించగా, కె స్నేహితకు నూజివీడులో సీటు లభించింది. అలాగే తోడేరులోని కాకాణి శేషమ్మ ఉన్నత పాఠశాలకు చెందిన భైనపూడి సుకృత నూజివీడు క్యాంపస్‌లో సీటు సాధించిందని ఆ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సీటు సాధించిన విద్యార్థినికి విద్యాశాఖ అధికారులతోపాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సునంద, బి పద్మజ, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిహారికకు ట్రిపుల్ ఐటీలో సీటు

మనుబోలు: మండలంలోని గోవిందరాజపురానికి చెందిన చింతలపూడి నిహారిక ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. దీంతో ఆమెను పాఠశాల హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. నిహారిక గతేడాది మనుబోలులోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ద్వితీయ శ్రేణి టాపర్‌గా నిలిచింది.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

మనుబోలు, జూలై 11: సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి వైసీపీ కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం మండల వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో ఇచ్చే సరుకులను సద్వినియోగం చేసుకోండి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, జూలై 11 : బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందజేస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు కోరారు. పట్టణంలోని వాటర్ ట్యాంక్ వద్ద నున్న రైతు బజార్ వద్ద శుక్రవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులైన కందిపప్పు, బియ్యంను తక్కువ ధరలకు రైతు బజార్లలో అందజేస్తుందని అన్నారు. ప్రభుత్వం దేశవాళి కందిపప్పు కిలో రూ.160, నాణ్యమైన స్టీమ్ రైస్ (బీపీటీ రకం) కిలో రూ.49, రారైస్ కిలో రూ.48 చొప్పున విక్రయిస్తున్నారు. ఒక్కో వినియోగదారునకు బియ్యం 5కిలోలు, కందిపప్పు కిలో పంపిణీ చేస్తుందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు అందించిన రాష్ట్ర పౌర సరఫరాల వ్యవస్థను పునర్నిర్మిస్తామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్యనాయుడు, కలగట్ల సందీప్, శ్రీను, పొట్టి సుధాకర్, ప్రభాకర్, గుర్రం మధు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో ఎన్టీఆర్ విగ్రహం

● ఏర్పాటుకు నాయకులు, అభిమానుల సన్నద్ధం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 11 : పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కల సాకారం కానుంది. బుచ్చిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి టీడీపీ నాయకులు ఓ జాబితా సిద్ధం చేశారు. ఇందులోనే బస్టాండు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఆ వినతిపత్రాన్ని అందజేశారు. ఒకప్పుడు అల్లూరు నియోజకవర్గంలో ఉన్న బుచ్చి ఆ తర్వాత కోవూరులో పరిధిలోకి చేరింది. అయితే, నగర పంచాయతీగా మార్పు జరిగినా ఇప్పటిదాకా పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం లేదు. గతంలో ప్రజాప్రతినిధులుగా పని చేసిన వారి కూడా దీనిపై దృష్టి సారించ లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నాయకులు, అభిమానులు సన్నద్ధమవుతున్నారు.



బుచ్చిలోని బస్టాండ్ సెంటర్

రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా

● 35 ఏళ్ల ప్రజాసేవకు దక్కిన ఫలితం



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 11 : రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా షేక్.ఖాదర్‌బాషా నియమితులయ్యారు. ఆయన గత 35 ఏళ్లుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రజలకు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించారు. ఆయనతోపాటు నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి ఉత్సవ కమిటీలో 70 మందిని సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ తనకు ఉత్సవ కమిటీ చైర్మన్ పదవి రావడం దేవుడు ఇచ్చిన వరమని అన్నారు. తమ నాయకులు, కమిటీ మెంబర్లు సహకారంతో రొట్టెల పండుగకు తరలి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించి జిల్లాకు గుర్తింపు తీసుకువస్తానని ఆయన తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరులకు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు టీడీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎంసీ కమిషనర్‌కు ఘనంగా వీడ్కోలు



కమిషనర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(సిటీ), జూలై 11 : చిత్తూరు జిల్లా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) పీడీగా బదిలీ అయిన కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌కు గురువారం ఎన్ఎంసీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసి అభినందన సభలో పాల్గొన్న అధికారులు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో మలోల, ఎన్ఎంసీ ఎస్ఈ సంపత్‌కుమార్, ఏడీసీ శర్మద, డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రాంగణ ఎంపికలు

నెల్లూరు (విద్య), జూలై 11 : నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వారు ఉద్యోగాలు కూడా పొందేలా కార్యాచరణ రూపొందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రాంగణ ఎంపికలకు జిల్లాలోని 13 కంపెనీలు పాల్గొని ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎంపికలను నిర్వహించారన్నారు. మొత్తం 260 మంది పాల్గొనగా, వీరిలో 192 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు అందిస్తూ ఉత్తర్వులు అందచేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.చెంగల్‌రాయన్, జిల్లా ఉపాధి అధికారి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్రోనోకార్పస్ వృక్షాల తొలగింపు

నెల్లూరు (వైద్యం) జూలై 11 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్యానికి హాని కలిగించే క్రోనోకార్పస్ వృక్షాలను గురువారం అధికారులు తొలగించారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ వృక్షాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ఉన్న కోనోకార్పస్ వృక్షాలను తొలగించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా కోనోకార్పస్ చెట్లను వేళ్లతో సహా తొలగించామన్నారు.హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కలు నాటుతామని వెల్లడించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సేవలు వినియోగించుకోండి

నెల్లూరు(హరనాథపురం), జూలై 11: వాత్సల్యలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ సేవలను వినియోగించుకోవాలని వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు కోరారు. వాత్సల్య శరణాలయంలో అమెరికాకు చెందిన డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి దాతృత్వంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్‌ను గురువారం నెల్లూరు ఎంఈవో మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఈ సెంటర్‌లో టైలరింగ్, ఎంబ్రాయిడరీలలో 3 నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలు సుబ్బారావు, గుర్రం సుధాకర్‌రావు, టీపీఎస్ దుర్గాప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పెరసం 15వ వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 11 : పెన్నా రచయితల సంఘం(పెరసం) 15వ వార్షికోత్సవం ఈనెల 13న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షురాలు సుభద్రాదేవి తెలిపారు. భక్తవత్సలనగర్‌లోని ఓ పాఠశాలలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో శనివారం ఉదయం 10గంటలకు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి తోలు సులోచన, అవ్వారు శ్రీధర్‌బాబు, గంగిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ ఆర్టిస్టుగా జేవీ సురేష్

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 11 : జిల్లాలోని నార్తురాజుపాలెంకు చెందిన ఓంకారం సంగీత శాక్సాఫోను పాఠశాల అధ్యాపకుడు జేవీ సురేష్‌ను ఆల్‌ఇండియా రేడియోలో ఏ గ్రేడ్ ఆర్టిస్టుగా సెంట్రల్ ఆడిషన్ బోర్డు ఎంపిక చేసింది. ఏ గ్రేడు సర్టిఫికెట్‌ను విజయవాడ ఏఐఆర్ స్టేషన్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు నుంచి గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయీబ్రాహ్మణ సంగీత వాయిద్య కళాకారులు సంఘం అధ్యక్షుడు కోట మాల్యాద్రి, కార్యదర్శి పండ్లూరు వాసు, కోశాధికారి వీరంపల్లి కిషోర్, జనరల్ సెక్రటరీ గువ్వాడి ధనుంజయులు సంయుక్తంగా అభినందనలు తెలిపారు.

'దాస్‌పైలాను అరెస్ట్ చేయాలి'

నెల్లూరు(హరనాథపురం); జూలై 11 : అద్వైతాన్ని అనుసరించే పౌరోహిత బ్రాహ్మణులను కించపరిచిన పార్వతీపురం నియోజకవర్గం శివిని గ్రామానికి చెందిన దాస్ పైలాను అరెస్ట్ చేయాలని అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం(ఏబీబీఎమ్) ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాళ్ళపల్లి కిషోర్‌శర్మ, రాష్ట్ర గౌరవ సలహాదారు రాళ్లపల్లి బాలసుబ్రహ్మణ్యం, రాళ్లపల్లి సుధాకర్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాధవాచార్యులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష

నెల్లూరు (వైద్యం) జూలై 11: జిల్లాలో గత మేనెలలో సంభవించిన మాతృమరణాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య గురువారం సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు అందించే వైద్య చికిత్సల్లో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని హెచ్చరించారు. గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు రక్తహీనతకు గురికాకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ సమీక్షలో వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌నాథ్ ,అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ బ్రిజిత, డాక్టర్ ప్రియంవద, డెమో శ్రీనివాసరావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నెల్లూరు (విద్య), జూలై 11 : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని బీటీఏ నేతలు కోరారు. సభ్యత నమోదులో భాగంగా గురువారం నారాయణ రెడ్డిపేట, నవలాకులగార్డెన్స్, కోడూరుపాడు, కృషినగర్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, నేతలు హనీఫ్‌బాబు, సంపత్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, ఆటస్థలాలు పేదలకు ఉపయోగపడాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 11: పార్కులు, ఆటస్థలాలు ధనికులకే కాదు.. పేద పిల్లలు ఆడుకునేందుకు ఉపయోగపడాలని మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ అన్నారు. నగరంలోని టెక్కేమిట్ట మహాలక్ష్మమ్మ గుడి పక్కన ప్రభుత్వ స్థలంలో వ్యర్థాలను గురువారం ఆమె తొలగింపచేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 11: నగరంలోని జేమ్స్‌గార్డన్ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం జరిగిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను గురువారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు టోనీబాబు మాట్లాడుతూ ప్రజలకు వ్యాక్సిన్ పట్ల ఉన్న అపోహలను తొలగించేందుకు జనసేన నాయకులు నడుంబిగించారన్నారు. కార్యక్రమంలో జేమ్స్‌గార్డన్ సచివాలయ కార్యదర్శి ఈదూరి స్నేహలత, ఆశా వర్కర్ పీ రేవతి పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 11: జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, అందులో భాగంగా నగరంలోని గోమతి నగర్‌లో జనసేన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించామని ఆ పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



నగరంలోని జనసేన కార్యాలయం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024



శేషాచలం అడవుల్లో పెద్దపులులు ఉన్నాయా?

వందేళ్లుగా ఈ కొండల్లో కనిపించని పెద్దపులి జాడ 2018లో కనిపించింది. ఆ తర్వాత ఎక్కడా వాటి ఆనవాళ్లు లేవు. దీంతో శేషాచలంలో పెద్దపులులు ఉన్నాయా, లేవా అనే విషయంలో అటవీశాఖకు కూడా స్పష్టత లేదు. తాజాగా పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్ పరిధిలో రెండు పెద్దపులులు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో శేషాచలంలోకి పెద్దపులుల రాక ఇంకెంతో దూరంలో లేదని భావిస్తున్నారు. నిజానికి పెద్దపులి కోసం శేషాచలం చాలా కాలంగా ఎదురు చూస్తోంది.

ఎర్రదొంగలకు దడ

శేషాచలం అడవుల్లోకి పెద్దపులి అడుగుపెడితే ఎర్రచందనం స్మగ్లర్లకు దడ మొదలవుతుంది. ప్రస్తుతం ఈ అడవిలో చిరుతపులులు మాత్రమే ఉన్నాయి. ఇవి గుంపులుగా ఉన్న మనుషులను చూసినా.. తిరగబడ్డా భయంతో పారిపోతాయి. పెద్దపులి మనిషికి భయపడదు. దీన్ని ఎదుర్కోవడం ప్రాణాలకు తెగించడమే. ఎర్రచందనం కోసం రాత్రిళ్లు అడవుల్లో యథేచ్ఛగా తిరగడం సాధ్యం కాదు. అయితే ఎర్ర స్మగ్లర్ల వల్ల పెద్దపులికి కూడా ముప్పు ఉంటుంది. చిరుతల్లా బెదరగొట్టి తరిమేయలేరు గనుక వీటిని విషాహారం పెట్టిగానీ, తుపాకులతో కాల్చేయడం గానీ చేసే ప్రమాదం ఉంది.

జీవవైవిధ్యం

పెద్దపులి వల్ల శేషాచలంలో జీవవైవిధ్యం సమతూకంలో ఉండే ప్రయోజనం ఉంది. అడవి పందులు, జింకలు, కణితలు, దుప్పులు వంటివి ఈ అడవుల్లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఇవి పెద్ద వృక్షాల జోలికి వెళ్లవుగానీ చిన్న మొక్కల్ని తినేస్తుంటాయి. ఒకవైపు ఎర్రచందనం స్మగ్లర్లు అడవిని నరికేస్తూ ఉంటే, కొత్త చెట్లు పెద్దవి కాకముందే శాఖాహార జంతువులకు ఆహారంగా మారిపోతున్నాయి. చిరుతలకు అవసరమైన ఆహారానికి మించిన సంఖ్యలో ఇవి పెరిగిపోయాయి. పెద్దపులి మాత్రమే వీటి సంఖ్యను కట్టడి చేయగలుగుతుంది. ఒకసారి వేటాడితే 50 కిలోల మాంసం ఆహారంగా తీసుకుంటుంది. పైగా వెయ్యి కిలోమీటర్ల పరిధిలో ఇది వేటసాగిస్తుంది.

- శేషాచలం సమీపంలో సంచరిస్తున్న పెద్దపులి
- లంకమలలో 9, వెలుగొండ అడవుల్లో 2 పులులు
- త్వరలోనే అడుగుపెడుతుందని అంచనా

పులిరాజుకు స్వాగతం!

కథనం
తిరుపతి (మంగళం)

బ్రిటీష్ పాలనా కాలంలో మామండూరు అటవీప్రాంతంలో కిన్నెల్ అండ్రీసన్ అనే దొర పెద్దపులిని వేటాడి చంపినట్లు మామండూరు అటవీకార్యాలయ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ తర్వాత ఇప్పటిదాకా వీటి జాడ లేదు. నల్లమలలో మాత్రం పెద్దపులుల సంఖ్య పెరుగుతూ ఉంది. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం దాదాపు 80 వరకు పెద్దపులులు ఉన్నాయి. వీటి సంఖ్య నల్లమలలో పెరిగేకొద్దీ ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. ఈ విస్తరణ వందల కిలోమీటర్లు ఉంటుంది. పెద్దపులులు సమూహాలుగా జీవించవు. ఒంటరిగానే ఉంటాయి. వీటి ఆవాసాలు దూరదూరంగా ఉంటాయి.ఒక పులి ఆవాసానికి కనీసం 50 కిలోమీటర్ల ఆవల మాత్రమే మరొక పులి ఆవాసం ఉంటుంది. ఒక్కోసారి వీటి నివాస పరిధి వెయ్యి కిలోమీటర్ల దాకా కూడా ఉంటుంది. అందుకే నల్లమలలో సంతతి పెరిగేకొద్దీ వీటి ఆవాస పరిధి కూడా విస్తరించక తప్పదు.

ఇదీ.. పెద్దపులికి రాదారి!

దీనిని గుర్తించిన అటవీశాఖ నల్లమల నుంచి శేషాచలం దాకా పెద్దపులుల కారిడార్ అని ప్రకటించింది. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టు నుంచి శేషాచలం రిజర్వ్‌ఫారెస్టులోకి లంకమల మీదుగా చేరుకోవచ్చు. మొత్తం అటవీ ప్రాంతమే. ఇప్పటికే వీటి ప్రయాణం మొదలైంది. పెద్దపులులు నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎస్ఎస్‌టీఆర్) నుంచి గుండ్ల బ్రహ్మేశ్వరం టైగర్ రిజర్వ్ (జీబీఎం) ఫారెస్ట్ మీదుగా లంకమల శాంక్చురీలోకి చేరుకుంటున్నాయి. ఈ విధంగా ఇప్పటికే లంకమలలోకి తొమ్మిది పులులు ప్రవేశించాయి. వీటి ఉనికిని అధికారులు గుర్తించారు. ఇక లంకమలకు అనుకుని రెండు కారిడార్లు వెళతాయి. ఒకటి కడప జిల్లా శేషాచలం అడవులు అయితే మరొకటి నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి శాంక్చురీ (పీఎన్ఎస్). కొద్ది రోజుల కిందట నెల్లూరు జిల్లా అటవీ ప్రాంతంలో కనిపించిన పెద్దపులులు ఈ కారిడార్ మీదుగా వచ్చినవేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. మర్రిపాడు ప్రాంతంలో ఒక మగపులి ఆనవాలు ఇటీవల కనిపించింది. ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో రెండేళ్లుగా ఒక ఆడపులి తిరుగుతోంది.



నల్లమల అటవీప్రాంతం నుంచి శేషాచల అటవీప్రాంతం వరకు టైగర్ కారిడార్ మ్యాప్

అనువైన అడవి శేషాచలం

ఇక మిగిలింది శేషాచలం మాత్రమే. లంకమలకు ఆనుకుని ఉన్న కడప జిల్లా పరిధిలోని శేషాచలం అడవుల్లోకి పెద్దపులి రాకపోకలకు పెద్దగా అవరోధం ఏమీ లేదు. 2018లో శేషాచలం పరిధిలోకి అడుగుపెట్టిన పెద్దపులి బహుశా ఆ తర్వాత మళ్లీ వెనుదిరిగి ఉండాలి. అయినా వాటి రాజమార్గం వాటికి ఉంది కాబట్టి అతి త్వరలోనే శేషాచలం అడవుల్లో పెద్దపులి అడుగుపెడుతుందని అటవీశాఖ అంచనా వేస్తోంది. శేషాచల కారిడార్‌లోకి పెద్దపులులు ప్రవేశిస్తే వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వాటికి అవసరమైన ఆహారం, ఆవాసం ఇక్కడ పుష్కలంగా ఉన్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.పెద్దపులులు మరీ దట్టమైన అడవిలో ఉండవు. ఇక్కడ అడవులు చెట్లతో చదునుగా, చిన్న చిన్న ఎత్తుపల్లాలతో ఉంటాయి. రాతి గుహలుంటాయి. పులులకు అవసరమైన ఆహారం.. జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, అడవిపందులు భారీ సంఖ్యలో శేషాచలంలో ఉన్నాయి. వీటితో పాటు నీటి వనరులు కూడా ఎక్కువే. ఒకసారి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే చాలు సంతతి పెంచుకుంటూ ఆవాసాలను విస్తరించుకుంటాయి.

భక్తుల భద్రతకు ఓవర్‌పాస్

పెద్దపులి వల్ల తిరుమల కొండకు వచ్చే భక్తులకు ముప్పులేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అలిపిరి నడక దారిలో ఏడో మైలు ప్రాంతంలో దట్టమైన అడవి ఉంటుంది. చిరుతల బెడద లేకుండా ఏడవ మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ వరకు ఓవర్‌పాస్ ఏర్పాటు చేయాలని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిపుణుల బృందం ఇప్పటికే టీటీడీకి సూచించింది. ఈ ఏర్పాటు చేస్తే పెద్ద పులి వల్లే కాదు, చిరుతలు, ఎలుగుబంట్ల ముప్పు కూడా భక్తులకు దాదాపుగా ఉండదు.

శేషాచలంలో వెతుకుతున్నాం

లంకమల అభయారణ్యం సమీపంలో.. శేషాచల అటవీప్రాంతంలో 2018లో కనిపించిన పెద్దపుల్లి ఆనవాళ్లు ఆ తర్వాత ఇప్పటిదాకా లేవు గానీ ఈ దిశగా శేషాచల అడవుల్లో తగిన అధ్యయనం జరగలేదు.ఇప్పుడిప్పుడే ఈదిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పరిశీలన తర్వాతే శేషాచలంలో పెద్దపులి ఉందా, లేదా అనే నిర్ధారణ జరుగుతుంది.

- రమేష్, బయాలజిస్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్.

రేషన్ బియ్యం బొక్కేస్తున్నారు!

- ప్రభుత్వం మారినా ఆగని అక్రమ రవాణా
- మరోమారు భారీగా బియ్యం పట్టివేత



నెలబల్లి వద్ద పట్టుబడిన బియ్యం లారీతో అధికారులు

సూళ్లూరుపేట, జూలై 11: సూళ్లూరుపేట కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే వుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డూఅదుపు లేకుండా చలాయించిన రేషన్ మాఫియాకు ఇప్పుడు కూడా దందాను కొనసాగిస్తోంది. సూళ్లూరుపేట రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో మన రేషన్ బియ్యంతో పాటు తమిళనాడు రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు.పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొందరు కార్డుదారులు అక్రమార్కులకు విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాముకు తరలించి అక్కడినుంచి రాత్రి సమయాల్లో లారీల ద్వారా బియ్యం బయటి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.ఇందుకు సహకరిస్తున్న స్థానిక అధికారులకే కాకుండా విజిలెన్స్, పౌరసరఫరాల జిల్లాస్థాయి అధికారులకు కూడా మాముళ్లు ముడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.బియ్యం తరలిస్తున్న ఓ లారీని బుధవారం అర్ధరాత్రి జోరువానలో సూళ్లూరుపేట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెంబడించారు. దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్ద పట్టుబడిన లారీని పోలీసులకు అప్పగించారు. అందులో 535 బస్తాల తమిళ బియ్యంతో పాటు మన రాష్ట్రానికి చెందిన 75 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయి. అదే విధంగా గూడూరులో 300 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నారు. అది కూడా సూళ్లూరుపేట ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ దందా చేస్తున్న వారే ప్రస్తుతం కూడా రేషన్ అక్రమ రవాణా చేస్తున్నారని తేలింది.భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నారని తెలియగానే పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులతో పాటు పోలీసులు ఉలిక్కిపడ్డారు.పట్టుబడిన లారీని తప్పించేందుకు నానా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. తహశీల్దార్ వెంటనే పోలీస్ స్టేషన్‌లో జీడీఆర్, బీట్ బుక్‌లో నమోదు చేసి లారీ డ్రైవర్ వద్ద వాంగ్మూలం తీసుకొని ఆర్డీవో చంద్రమునికి సమాచారం అందించారు. గురువారం ఉదయం కూడా కొందరు అధికారులు బియ్యాన్ని తక్కువ చేసి చూపించాలని ప్రయత్నాలు చేశారు.బియ్యం బస్తాలను నిల్వచేసుకొనేందుకు స్థలం లేదు.. ఎక్కడ దించుకోవాలంటూ కుంటి సాకులు చెబుతూ మధ్యాహ్నం వరకు కాలం వెళ్లబుచ్చారు. దీంతో జేసీ ధ్యానచంద్రకు తహశీల్దార్ సమాచారం ఇచ్చారు. దీంతో జేసీ పౌరసరఫరాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జేసీ ఆదేశాల మేరకు తడ మండలం కొండూరు వద్దనున్న పౌరసరఫరాల గోదాములో పట్టుబడిన బియ్యాన్ని కూలీలను పెట్టి దించి భద్రపరిచారు. లారీ డ్రైవర్ చంద్ర వాంగ్మూలం మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

15.5 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత



గూడూరు, జూలై 11: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జాతీయరహదారిపై గురువారం 15.5 టన్నుల రేషన్‌బియాన్ని తరలిస్తున్న లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు.తడ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

పట్టుబడిన లారీ వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

కారు ఢీకొని ముగ్గురు యువ కూలీల దుర్మరణం







రోడ్డుపై చెల్లాచెదురుగా సుఖ్‌దేవ్‌సింగ్, రాజాసింగ్,బపున్‌సింగ్ మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11: పొట్టకూటికి పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు ..ఒడిశాకు చెందిన బపున్‌సింగ్ (21) రాజాసింగ్(22) సుఖ్‌దేవ్‌సింగ్(22) బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు శ్రీనిధి రాజా పరిశ్రమలో రెండేళ్లుగా కూలీలుగా పనిచేస్తున్నారు. కంపెనీ సమీపంలోనే కలసి ఉంటున్నారు. గురువారం వంట సరుకులు కొనుగోలు చేయడానికి కంపెనీ మేనేజర్ ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా బుచ్చినాయుడుకండ్రిగ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరారైన కారు డ్రైవరు కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

తిరుపతిలో డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

తిరుపతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ అండ్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో తిరుపతి కేంద్రంగా డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇక్కడ ఈ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తిరుపతి కార్యాలయం పరిధిలోకి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాలు రానున్నాయి. అలాగే దీని పరిధిలో కడప, నెల్లూరు, తిరుపతి సబ్ డివిజన్లు వుంటాయి. ఇప్పటికే సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించి తిరుపతి కీలక కేంద్రంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నేరుగా ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగానికి సంబంధించి కూడా తిరుపతి ముఖ్య పాలనా కేంద్రంగా మారనుంది. తిరుపతిలో కార్యాలయం ఏర్పాటుకు అనుమతినిస్తూ, అలాగే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టీడీపీ శ్రేణులపై నమోదైన కేసులెన్ని?

ఎన్నికలకు ముందు, తర్వాత లెక్కలు తీస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11: సార్వత్రిక ఎన్నికలకు ముందు , ఆ తర్వాత తెలుగుదేశం శ్రేణులపై ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎంతమందిని బైండోవర్ చేశారు..అనవసరంగా కేసుల్లో ఇరుక్కున్న వారెంతమంది వున్నారనే వివరాలను సర్కిళ్ళ వారీగా పోలీసులు సేకరిస్తున్నారు.ఈ మొత్తం వివరాలు రెండు రోజుల్లో పంపాలని ఎస్పీకి ఉన్నతాధికారులనుంచీ ఆదేశాలందాయి.వైసీపీ నేతల ఆదేశాల మేరకు ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై విచక్షణారహితంగా పోలీసులు కేసులు నమోదు చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు దాదాపు 250 కేసులు నమోదైనట్లు సమాచారం. ఇందులో 107 సీఆర్పీసీ కింద 200 కేసులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించిన కేసులు మరో 50 వున్నాయి. పోలింగు అనంతరం మహిళా వర్శిటీ వద్ద నానీపై జరిగిన దాడి,తరువాత చోటుచేసుకున్న ఘర్షణలు, విధ్వంసాలు, అంతకు ముందు రోజు పాకాల, కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ, పులివర్తివారిపల్లెల్లో జరిగిన ఘటనల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులు, వాటి సెక్షన్లు, ఎఫ్ఐఆర్ కాపీలను స్కాన్ చేసి పంపేందుకు సిద్ధం చేస్తున్నారు.వీటిలో తప్పుడు కేసుల గురించి కూడా వివరించనున్నారు. మొత్తం 8 కాలాలతో వున్న ఫార్మాట్లో ఈ వివరాలను పంపడానికి పోలీసు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ ధ్యానచంద్ర

రైతుబజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలు ప్రారంభం

తిరుపతి(ఆటోనగర్), జూలై 11: రైతు బజారులో కిలో కందిపప్పును రూ.160కి అందుబాటులో ఉంచినట్లు జేసీ ధ్యానచంద్ర తెలిపారు. ఆర్సీ రోడ్డులోని రైతు బజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16 కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కౌంటర్ల ద్వారా 593 మందికి స్టీమ్‌రైస్ కిలో రూ.49కి, పచ్చిబియ్యం కిలో రూ.48కి, కందిపప్పు కిలో రూ.160 చొప్పున 1,516 కిలోల బియ్యం, 1,002 కిలోల కందిపప్పును విక్రయించినట్లు వివరించారు. పౌరసరఫరాలశాఖ అధికారులు, రైతుబజారు ఎస్టేట్ అధికారి అయ్యప్పన్ పాల్గొన్నారు.

4 నుంచి 11వ తేదీవరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), జూలై 11: కడప-తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487-17488)ను ఆగస్టు నాలుగు నుంచి 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య ఆటోమేటిక్ సిగ్నల్ పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మోటారు సైకిలిస్టులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : జడ్జి సంయుక్త



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

నాయుడుపేట టౌన్, జూలై 11 : మోటారు సైకిలిస్టులు ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా ప్రాణరక్షణ కోసం హెల్మెట్ ధరించాలని జడ్జి సంయుక్త అన్నారు. నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడం జరుగుతుంటుందని, హెల్మెట్ ధరించడం ద్వారా రక్షణగా ఉంటుందన్నారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల పోలీస్ అధికారులతో మాట్లాడుతూ హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పసల చెంగయ్య, పార్థసారథిరెడ్డి, చదలవాడ కుమార్, కిషోర్ ఉన్నారు.

గూడూరుకు చేరుకున్న పాదయాత్ర



టీడీపీ నాయకులకు పండ్లు అందజేస్తున్న స్థానిక టీడీపీ నేత

గూడూరు, జూలై11: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటామని మొక్కుకున్న బాపట్ల జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర గురువారం గూడూరుకు చేరుకుంది. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు ఏసుపాక పెంచలయ్య వారికి పండ్లు అందజేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి టీడీపీ రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి మధుసూదన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 60 మంది టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో మొక్కులు చెల్లించుకునేందుకు వీరు కొల్లూరు నుంచి చేపట్టిన పాదయాత్ర 11వ రోజు గూడూరుకు చేరుకోవడంతో వారికి సంఘీభావం తెలిపామన్నారు.

క్రోనోకార్పస్ మొక్కలను తొలగించాలి

గూడూరు, జూలై 11: పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఉన్న క్రోనోకార్పస్ మొక్కలను తొలగించాలని ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జనసేన ఆధ్వర్యంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోనోకార్పస్ మొక్కల వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి మానవ మనుగడకు ప్రమాదకరంగా మారుతుందన్నారు. మొక్కలను తొలగించి వీటి స్థానాల్లో పర్యావరణానికి మేలు చేసే మొక్కలను ఏర్పాటు నాటాలన్నారు. కార్యక్రమంలో విజయ్, సుమన్, హరి పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న ఈయూ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 11: ఆర్టీసీ కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు సాగించి సమస్యలను పరిష్కరించు కోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.


ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట, జూలై 11: ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యేను అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించి సత్కరించారు. వైద్య వృత్తిలో ఉంటూ తొలి మహిళా ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆమెను వైద్యశాలలో సన్మానించడం సంతోషంగా ఉందని వైద్యుడు రమేషన్ అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ, అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పార్థసారథి, వెంకటేశ్వర్లు రెడ్డి, మాధవనాయుడు, బుజ్జిబాబు, పెంచలయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంఈవో తదితరులు

పెళ్లకూరు, జూలై 11 : మండలంలోని యడపూడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంఈవో మించల శంకరయ్య గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి బడి ఈడు పిల్లలు బడిలో చేరేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పుష్పలత, శివనాగరాజు, సీఆర్పీ సీహెచ్ బాబు, విద్యాకమిటీ చైర్మన్ యోగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు చోరీ

నాయుడుపేట టౌన్, జూలై 11 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రెండు ఏటీఎంలలో ఏటీఎం కార్డును మార్చి నగదు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. పూడేరు గ్రామానికి చెందిన మహిళ తన ఏటీఎం కార్డు ద్వారా నగదు తీసుకునేందుకు ఏటీఎంలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడే ఉన్న మరో వ్యక్తి నగదు తీసి ఇస్తానంటూ ఆ మహిళ నుంచి ఏటీఎం కార్డు తీసుకొని తన చేతిలో ఉన్న మరో ఏటీఎం కార్డును ఆ మహిళకు ఇచ్చాడు. అక్కడ నుంచి ఆ వ్యక్తి ఉడాయించాడు. కొంత సమయం తరువాత ఆ మహిళ సెల్‌ఫోన్‌కు రూ.12వేల నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ కంగారుపడి తమ దగ్గర ఉన్న ఏటీఎం కార్డు చూసుకోగా అప్పటికే మారిపోయి ఉన్నట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది.

విద్యాసామగ్రి అందజేత



మాట్లాడుతున్న చెంచురామయ్య

గూడూరుఅర్బన్, జూలై11:స్థానిక మాళవ్యానగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం గోపాల్‌రెడ్డి దాతృత్వంతో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వంతో ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, జూలై 11: స్థానిక 1వ వార్డులో గురువారం టీడీపీ కార్యకర్త వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడి అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ. 3వేలు ఆర్థికసాయాన్ని వెంకటయ్య కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు శివకుమార్, రాము అందజేశారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠకు విరాళాల సేకరణ



గూడూరు,జూలై11: స్థానిక సాయినగర్‌లో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో స్వామి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో భాగంగా అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ఠకు సంబంధించి భక్తులందరినీ భాగస్వామ్యులను చేసేందుకు గురువారం ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గాధంశెట్టి గిరిబాబు, కోటి, సుబ్బారావు, శివయ్య, వినయ్‌కుమార్, మధు, శ్రీనివాసాచారి, సుబ్రమణ్యం, శ్రీహరి, కార్తీక్, నరసింహులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తడ, జూలై 11 : మండల యూటీఎఫ్ నూతన సభ్యత్వ కార్యక్రమం గురువారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి సునీలా ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ్యత్వ నమోదులో 98మంది ఉపాధ్యాయులను సభ్యులుగా చేర్చుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, అధ్యక్ష కార్యదర్శులు నవీన్‌కుమార్, రాంబాబు, కార్యదర్శులు శ్రీనివాసులు, దుర్గాదేవి, రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలి

వెంకటగిరిటౌన్, జూలై 11: డక్కిలి మండలంలో పొదుపు సంఘాలలో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దెల మునెయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016 ఏప్రిల్ నుంచి 2023 వరకు 27గ్రామాల్లో ఆర్థిక లావాదేవీలు క్షేత్రస్థాయిలో జరపాలని కోరారు.ఒక్కొక్క రూపాయి దాచుకుని పొదుపు సంఘాలు కట్టుకుంటుంటే వాటిలో కూడా అవినీతి జరిగిందని పేర్కొన్నారు. విచారణ నిర్వహించి వారిని నగదు రికవరీ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. చేశారు.

యువకుడి ఆత్మహత్య



గూడూరు, జూలై 11: స్థానిక టిడ్కో గృహాల వద్ద ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు... కోట గ్రామానికి చెందిన సందీప్(34) మంగళవాయిద్యం వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సందీప్‌కు తెలిసినవారి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

ఎర్రచందనం కేసులో డ్రైవర్ అరెస్ట్

తడ, జూలై 11 : ఎర్రచందనం రవాణాకేసులో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట నుంచి చెన్నైకు తరలిస్తున్న ఎర్రచందనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ కేసులో ట్రక్ ఆటో డ్రైవర్ కత్తి వెంకటసుబ్బయ్యను అరెస్టు చేశామని ఎస్ఐ నరసింహరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పార్తిపన్, కార్తీక్, కమల్‌నాథ్‌తోపాటు మరో వ్యక్తికి ఈ అక్రమ రవాణాకు సంబంధం ఉందని దర్యాప్తులో తేలిందని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.35.03 లక్షలు ఉంటుందని, దాంతోపాటు ట్రక్ ఆటో డ్రైవర్ వద్ద మరో 17,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పుకొచ్చారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

సూళ్లూరుపేట, జూలై 11:మండల పరిధిలోని కొమ్మినేనిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పాకం నాగయ్య(47) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలసి గురువారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకొంటామని ఎమ్మెల్యే తెలిపారు.

అక్రమ లే అవుట్లపై కమిషనర్ ఆరా

వెంకటగిరి, జూలై 11 : వెంకటగిరిలో అడ్డగోలుగా వెలిసిన వెంచర్లపై నిబంధనలకు గండి .. అక్రమార్జన దండి అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం వెలువడటంతో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ స్పందించారు. పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా వెలిసిన లే అవుట్ల వివరాలు సేకరణలో నిమజ్ఞమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో వాటిపై దాడులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే అనుమతులు లేకుండా వున్న పలు లే అవుట్లను గుర్తించామన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ





ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న మెకానిక్‌లు, స్కూటర్ ర్యాలీలో టీడీపీ నాయకులు, మెకానిక్‌లు

నాయుడుపేట, జూలై 11 : నాయుడుపేట పరిసర ప్రాంతాల్లోని మెకానిక్‌ల కోసం ఆటో నగర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మెకానిక్‌లు ఎమ్మెల్యేను కలసి తమకు ఆటో నగర్‌తో ఉపాధి కల్పించాలని కోరారు. కలెక్టర్‌తో మాట్లాడి జాతీయ రహదారి వద్ద ఆటో నగర్‌కు కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఉన్న ఆటో గ్యారేజీలు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన జాతీయ రహదారి పక్కన ఉన్న అన్నా చెరువు స్థలం ఆటోనగర్‌కు అనుకూలంగా ఉంటుందని ఆ మేరకు నాయకులతో కలసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇటీవల రెండు మెకానిక్ షాపుల్లో చోరీ జరగడంతో బాధితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున వైస్ చైర్మన్ షేక్ రఫీ ఎమ్మెల్యే విజయశ్రీ ద్వారా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నెలవల రాజేష్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, పేరం రమేష్‌నాయుడు, ఆలీ, రఫీ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మెకానిక్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్ ఆధ్వర్యంలో నాయుడుపేట మెకానికల్ యూనియన్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడుగా షేక్ రఫీ, ఆలీ, అధ్యక్షుడుగా పి. శ్రీనివాసులు,కార్యవర్గసభ్యులుగా దశరథ, నజీర్, రమేష్, మౌలా, అశోక్‌ను ఎన్నుకున్నారు.

మెకానిక్ కార్మికుల బైక్ ర్యాలీ

నాయుడుపేట టౌన్ : మెకానిక్ కార్మికులు గురువారం 200 మోటారు సైకిళ్లతో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న యూనియన్ కార్యాలయం నుంచి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మెకానిక్ కార్మికుల సంఘం నాయకుడు ఆలీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ యువనాయకుడు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ పాల్గొన్నారు. కార్యక్రమంలో మెకానిక్ కార్మిక సంఘ నాయకులు రమేష్, నజీర్, శ్రీనివాసులు, అశోక్, దశరథ, కాలేషా, హరీష్, బాబు, మెకానిక్ కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను నియంత్రిస్తాం

ఎమ్మెల్యే కురుగొండ్ల



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 11 : రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడమే లక్ష్యంగా పెట్టుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని కుమ్మరమిట్ట ప్రాంతంలో రాష్ట్ర పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణలో వెంకటగిరిలో ఏర్పాటు చేసిన వీటిఎస్ రైస్ మార్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తోడుగా వుండాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం చౌకధరల్లో బియ్యం, పప్పు దినుసులను అందించాలని ప్రయత్నం చేస్తోందన్నారు.ఈ ప్రయత్నంలో భాగంగా జిల్లా రైస్ మిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హోల్‌సేల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారు ముందుకు వచ్చి మార్కెట్ ధరకంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులు బియ్యం, కందిపప్పును విక్రయించేలా సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పోలేరమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, చంద్రారెడ్డి, గంగాధర్, గల్లా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్, జీకేపల్లి బాబు నాయుడు, బీజేపీ నాయకులు ఎస్ఎస్ఆర్ నాయుడు, మల్లారం బాబు తదితరులు వున్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు

సూళ్లూరుపేట : బహిరంగ మార్కెట్‌లో లభించే నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకే పేదలకు అందించేందుకు ప్రభుత్వం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జీఎన్‌టీ రోడ్డులో బ్రహ్మంగారి మఠం వద్ద పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు ఇతర సరుకుల సరఫరా కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందించడం చాలా సంతోషమన్నారు. ఈ సందర్భంగా బియ్యం బస్తా, కందిపప్పు ప్యాకెట్లను ఆమె కొనుగోలు చేసి పేదలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అలవల శ్రీనివాసులు, ఆకుతోట రమేష్, వేనాటి రాజారెడ్డి, ఈవీ సురేష్, మునస్వామి, తహసీల్దార్ గోపాల కృష్ణ, సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

బియ్యం, కంది పప్పు విక్రయ కేంద్రం ప్రారంభం



బియ్యం విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 11: పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి పేదలకు అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక రైతుబజారులో జిల్లా రైస్‌మిల్స్ అసోసియేషన్, హోల్‌సేల్ కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేదలు అవస్థలు పడ్డారన్నారు. పేదలకు నిత్యావసర వస్తువులను మార్కెట్ రేట్ కంటే తక్కువ ధరలకు విక్రయించేలా రైతుబజారులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కిలో కందిపప్పు రూ. 160, స్టీమ్‌బియ్యం కిలో రూ. 49, బియ్యం కిలో రూ. 48లకు అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, అల్లీహుస్సేన్, నరసింహులు, తహసీల్దారు కరుణ్‌కుమార్, హజ్మతుల్లాఖాన్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశాలు !

కూటమి సర్కారు హయాంలోనైనా మారేనా ?

తడ, జూలై 11 : గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏర్పాటు చేసే మండల సర్వసభ్య సమావేశాలు తూతూమంత్రంగానే జరుగుతున్నాయి. 11వ మండల అభివృద్ధి కమిటీలు 2021 సెప్టెంబరులో ఏర్పడ్డాయి. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించాల్సి ఉంది. ఇందుకు అన్నిశాఖల మండలస్థాయి అధికారులు నివేదికలతో హాజరై జరుగుతున్న పనులను సభ దృష్టికి తీసుకువస్తారు. 10వ కమిటీ వరకు తీర్మానించిన ప్రకారం పనులు జరిగేవి. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2021 సెప్టెంబరు 24వ తేదీ 11వ మండల కమిటీ ఏర్పడింది. అప్పటినుంచి 11సార్లు సర్వసభ్య సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాలు మొక్కుబడిగా జరిగిపోయాయి. చర్చించే అంశాలపై చర్యలు శూన్యమని చెప్పవచ్చు. కారణం పంచాయతీలలో నిధుల కొరత. ప్రతి సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, గృహ నిర్మాణం, ఎన్ఆర్ఈజీఎస్ పనులు వంటి విషయాలపై అధికారులు వివరాలు సమర్పించినా వాటిలోని లోటుపాట్లను సభ్యులు లేవనెత్తే పరిస్థితి లేకుండా పోయేది. ఒకరిద్దరు సభ్యులు సమస్యను సభ దృష్టికి తెచ్చినా, ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవికావు. రామాపురం పంచాయతీలో జగనన్న కాలనీ ఇళ్లకు ఇసుక సరఫరా కావడం లేదంటూ అక్కడ సర్పంచ్ ప్రతి సమావేశం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకపోయేది. కారణం ఆ ఇసుక తమిళనాడు పరిధిలోని ఆరంబాకం నుంచి రామాపురం పంచాయతీకి చేరాల్సిన పరిస్థితి ఉండటంతో అక్కడి అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. మిగిలిన పనులకు నిధులు లేవంటూ అప్పటి సమావేశాలలో బాహాటంగానే అధికారులు చెప్పిన పరిస్థితి ఉంది. చివరకు భీములవారిపాళెం పడవలరేవు నుంచి సూళ్లూరుపేటకు ఆర్టీసీ బస్సును నడపాలన్న ప్రతిపాదన సమావేశం దృష్టికి తీసుకువచ్చినా అదీ ఆచరణకు నోచుకోలేదు. ఇలా గత 11 సమావేశాలు తూతూమంత్రంగా జరగడం తీర్మానాలు మాత్రం ఘనంగా ప్రతిపాదించడం పరిపాటిగా మారిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. మొదటి సమావేశం నేడు జరగనుంది. ఈ సమావేశాల నుంచి అయినా గ్రామాల అభివృద్ధికి సంబంధించి సరైన తీర్మానాలు చేస్తారని పనులు సైతం జరుగుతాయని ఆశిద్దాం.

గ్రామాల్లో పనులే జరగలేదు



సర్పంచ్‌గా ఎన్నికై మూడేళ్లు దాటిపోయింది. ఏ పనిచేయాలన్నా నిధులు లేవంటున్నారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు, పారిశుధ్య కార్మికుల జీతాలకు, కరెంట్ బిల్లులకు సరిపోయేవి. అభివృద్ధి పనులకోసం అడిగితే నిధులు లేవని చెప్పేవారు. ఇకనైనా ఈ సమావేశంలో అభివృద్ధి పనులు జరగాలని కోరుకుంటున్నా.

- కటారి అన్నపూర్ణ, సర్పంచ్, వేనాడు


మాగోడు ఆలపించేవారే లేరు



గత సమావేశాలలో షాడో సర్పంచ్‌ల హవా నడిచేది. మాగోడు చెప్పుకుందామన్నా ఆలకించేవారే ఉండేవారు కాదు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. సమస్యల పరిష్కారానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని నమ్మకం ఉంది.

- కారికాటి మునెమ్మ, ఎంపీటీసీ, వాటంబేడు


తీరం వెంబడి అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కోట, జూలై11: సముద్ర తీరం వెంబడి మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ కిషోర్‌కుమార్, ఎస్ఐ నాగబాబు సూచించారు. మండల పరిధిలోని యమదిన్నెపాళెం, గున్నం పడియ, శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం సముద్ర తీరం వెంబడి రెండవ రోజు అయిన గురువారం ఆపరేష్ సాగర్ కవచ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మత్స్యకారులతో సమావేశమై సముద్రం మార్గంలో అక్రమ రవాణా జరిగితే ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. తీవ్రవాదుల కదలికలపై పోలీసులకు సహకారం అందించాలన్నారు. ఆపదకాలంలో తిరుగుబాటు చేసే కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా వివరించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దాం




జెండాను ఆవిష్కరిస్తున్న డిపో గౌరవాధ్యక్షుడు

వెంకటగిరిటౌన్, జూలై 11: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్‌లు పని చేయాలని వెంకటగిరి డిపో గౌరవ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం డిపో వద్ద ఏపీపీటీడీ 73వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీపీడీఎన్ యూనియన్ 1951లో ఏర్పడి ఎన్నో ప్రణాళికలు రూపొందించిందని, వాటి అమలు కోసం పోరాటాలు చేశారని తెలిపారు. రోజుకు 8గంటలు, సంక్షేమ పథకాలు కోసం యాజమాన్యం, పోరాటాలు చేసిన ఏకైక యూనియన్‌గా గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో వైవీ. ప్రసాద్, రాజగోపాల్, రమేష్, తరకేశ్వర్, మోహన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డికి కుండీని అందిస్తున్న చిన్నారి

నాయుడుపేట టౌన్, జూలై 11 : చెట్ల పెంపకంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని టీడీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు గురువారం పర్యావరణం-పరిరక్షణ, ప్రకృతిని పెంపొందించుకోండి - ప్రకృతి మిమ్మల్ని పెంచుతుంది అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రియాజ్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, జ్యోతి, గౌస్‌బాషా, జయశ్రీ, షాహినా, బాలగురవయ్య, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కోట, జూలై 11 : ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఇంగిలాల కార్తీక్ కుటుంబసభ్యులకు గురువారం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు రూ.5వేలు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి పంత్రాంగం వసంత్ పాల్గొన్నారు.